
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కృష్ణా జిల్లా వార్తలు
సోమవారం 14 జూలై 2025





- దాదాపు 750 చిత్రాల్లో నటించిన విలక్షణ నటుడు
- 2015లో పద్మశ్రీ అవార్డు అందుకున్న ఘనత
- 1999-2004లో విజయవాడ తూర్పు ఎమ్మెల్యేగా సేవలు
- సింగ్‌నగర్ ఫ్లై ఓవర్, బీఆర్‌టీఎస్ రోడ్డు పూర్తి చేయించారు
- ఆ తర్వాత రాజకీయాలకు తాను సరిపోనంటూ గుడ్‌బై

అనుబంధాల కోట

సీనియర్ నటుడు కోట శ్రీనివాసరావు స్వస్థలం కంకిపాడు

డాక్టర్ కాబోయి యాక్టర్‌గా సినీరంగ ప్రవేశం

సినీ మేరు పర్వతం కరిగిపోయింది. విలక్షణ నటనా నిధి నింగికెగసింది. వైవిధ్యభరిత హావభావాలు.. వినూత్న మేనరిజానికి ప్రతిబింబంగా నిలిచిన 83 ఏళ్ల మహానటుడు ఇక సెలవంటూ అస్తమించారు. తెలుగు సినీ సౌరభాలను తనదైనశైలిలో పండించి, పాత్రకు ప్రాణం పోసిన సీనియర్ నటుడు కోట శ్రీనివాసరావు హైదరాబాద్‌లో కన్నుమూయడంతో అటు సినీలోకంతో పాటు ఇటు కృష్ణాతీరం కూడా కంటతడి పెట్టింది. మహానటులు ఎస్వీ రంగారావు, కైకాల సత్యనారాయణ సరసన చేరి, అంతటి విలక్షణ పాత్రలతో చెరగని ముద్ర వేసిన అనుబంధాల 'కోట' మన కృష్ణాజిల్లాకు చెందినవారు కావడం విశేషం. 1943లో కంకిపాడులో జన్మించిన ఆయన కాలక్రమంలో సినీ రంగంలో ప్రవేశించారు. దాదాపు 750 చిత్రాల్లో నటించిన కోట 2015లో పద్మశ్రీ అవార్డు అందుకున్నారు. 1999 నుంచి 2004 వరకు విజయవాడ తూర్పు ఎమ్మెల్యేగా సేవలందించారు. ప్రస్తుత తూర్పు ఎమ్మెల్యే, నాటి ఎంపీ గద్దె రామ్మోహన్‌తో ఆయనకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. కళ్లు రెండూ పెద్దవి చేసి విలనిజం పండించినా.. చిలిపిగా చూస్తూ కామెడీని రక్తి కట్టించినా.. తండ్రిగా ఒదిగినా.. భర్తగా హింసించినా.. తాగుబోతుగా తూలినా.. సహోదరుడిగా ఏడ్పించినా.. ఆయన హావభావాలు ఎప్పటికీ మన మదిలో మెదులుతూనే ఉంటాయి. మనిషి మాయమైతేనేం.. చెదరని ఎన్నో పాత్రలు ఆయన్ను మనకు మననం చేస్తూనే ఉంటాయి.

అరాచకవాదులతో జగన్‌రెడ్డి కుట్రలు!

- మంత్రి కొల్లు రవీంద్ర



పేర్ని నానిపై చర్యలు తీసుకోండి

- విజయవాడలోని కొత్తపేట స్టేషన్‌లో టీడీపీ మైనార్టీ నేతల ఫిర్యాదు

ఇంద్రకీలాద్రిపై పోటెత్తిన భక్తులు

- దుర్గమ్మను లక్ష మంది దర్శించుకున్నారని అంచనా
- మధ్యాహ్నం సమయానికే 50 వేల మందికి పైగా రాక

6

అయ్యో బాల్యం

- నగరంలో పెరుగుతున్న బెగ్గింగ్ మాఫియా
- భిక్షాటన ముసుగులో చీకటి వ్యాపారం
- నగరంలో మహిళా స్త్రీ శిశు సంక్షేమ శాఖ దాడులు
- ఇద్దరు చిన్నారులను ప్రజ్వల ఓపెన్ షెల్టర్‌కు తరలింపు



గుణదల/కృష్ణలంక, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : బెజవాడ కేంద్రంగా బెగ్గింగ్ మాఫియా పెచ్చుమీరుతోంది. ధనాపేక్షతో కొందరు తల్లిదండ్రులని చెప్పుకొనేవారు, దళారులు బాల్యాన్ని చిదిమేస్తూ చిన్నారుల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్నారు. ప్రభుత్వం.. శిశు సంరక్షణ చట్టాలను పటిష్టంగా అమలు చేస్తున్నప్పటికీ అధికారుల నిర్లక్ష్యం, పనితీరులో లోపాలు బాల్యాన్ని చిదిమేస్తున్నాయి. తాజాగా బెగ్గింగ్ మాఫియా ఆగడాలపై అందిన ఫిర్యాదుల నేపథ్యంలో జిల్లా శిశు సంరక్షణ శాఖ అధికారి రాజేశ్వరరావు ఆదేశాలతో, మాచవరం పోలీసుల సహకారంతో, సోషల్ వర్కర్ లత నేతృత్వంలో పీబీ సిద్ధార్థ కళాశాల సమీపంలో చిన్నారులతో భిక్షాటన చేయిస్తున్న పలువురిని ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. కొందరు పరారు కాగా, ఇద్దరిని మాత్రం కృష్ణలంకలోని 'ప్రజ్వల' ఓపెన్ షెల్టర్‌కు తరలించారు. వారి తల్లులుగా చెప్పుకొంటున్న యాచకురాళ్లను ప్రశ్నించగా, పొంతనలేని సమాధానాలిచ్చారు. ఎలాంటి ఆధారాలు చూపలేకపోయారు. తల్లిదండ్రుల దగ్గర నుంచి తీసుకొస్తే వారి వివరాలు ఇవ్వాలని, మధ్యలో ఏజెన్సీలు ఉంటే వారి గురించి చెప్పాలని అడిగినా వారు నోరు విప్పలేదు. తల్లిదండ్రులు వచ్చే వరకు పిల్లలు తమ సంరక్షణలోనే ఉంటారని చెప్పిన అధికారులు యాచకురాళ్లను కూడా అదుపులోకి తీసుకున్నారు.

చట్టప్రకారం చర్యలు : లత, సోషల్ వర్కర్

ఇద్దరు పిల్లలను ప్రజ్వల ఓపెన్ షెల్టర్‌కు తరలించాం. సోమవారం చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఎదుట పిల్లలను, వారి తల్లులుగా చెబుతున్న వారిని హాజరుపరుస్తాం. కమిటీ వారు సదరు పిల్లలు, వారి తలిదండ్రులుగా చెప్పుకొనే వారి ధ్రువీకరణ పత్రాలు పరిశీలించి బాలల న్యాయ సంరక్షణ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటారు.

హైటెన్షన్

- మచిలీపట్నం, పెడనలో ఉద్రిక్తత...
- పేర్ని ఇంటి వద్ద పోలీస్ బందోబస్తు
- గుడివాడ ఘటన నేపథ్యంలో పెడన వెళ్లవద్దన్న పోలీసులు
- పోలీసుల మాటలు లెక్క చేయకుండా వెళ్లి రెచ్చగొట్టే ప్రసంగాలు
- చంద్రబాబు నుంచి కొల్లు రవీంద్ర వరకూ అందరిపై ఇష్టానుసారం వ్యాఖ్యలు

బందరులో రాజకీయం వేడెక్కుతోంది. 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ' పేరుతో వైసీపీ నిర్వహిస్తున్న సమావేశాల్లో పేర్ని నాని రెచ్చగొట్టే వ్యాఖ్యలతో రాజకీయ దుమారం మొదలైంది. పామర్రులో చేసిన నరుకుడు భాషను మించి పెడనలో రెచ్చిపోయారు. 'నేను చెబితే పట్టపగలే చేయాలని చెబుతానంటూ' వీర్రవీగారు. శనివారం గుడివాడలో జరిగిన ఘటనలతో పామర్రు వెళ్లవద్దన్న పోలీసుల హెచ్చరికలను పెడచెవినపెట్టి 'టీడీపీ అధినేత చంద్రబాబు నుంచి పవన్ కల్యాణ్, లోకేశ్, మంత్రి కొల్లు రవీంద్రపై ఇష్టం వచ్చినట్టు మాట్లాడారు.





మచిలీపట్నంలో మాజీ మంత్రి పేర్ని నాని ఇంటి వద్ద పోలీసులు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: కూటమి ప్రభుత్వం వైఫల్యాలను ప్రజలకు వివరించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన వైసీపీ నియోజకవర్గ సమావేశాల్లో మాజీ మంత్రి పేర్ని నాని కార్యకర్తలను రెచ్చగొట్టే విధంగా చేసిన వ్యాఖ్యలు జిల్లాలో రాజకీయ దుమారం రేపాయి. అధికార, ప్రతిపక్షాలు విమర్శలతో హోరెత్తిస్తున్నాయి. ఆదివారం పెడన నియోజకవర్గ వైసీపీ సమావేశం నేపథ్యంలో పెడన పట్టణంలో పోలీసులు పెద్ద ఎత్తున బందోబస్తును ఏర్పాటు చేశారు. మచిలీపట్నంతో పాటు ఇతర ప్రాంతాల నుంచి పోలీసులను రప్పించి ఎక్కడికక్కడ పహారా పెట్టారు.

పేర్ని ఇంటి వద్ద ఉద్రిక్తత

వైసీపీ సమావేశాల్లో వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన మాజీ మంత్రి పేర్ని నానిపై పలు పోలీస్ స్టేషన్‌లలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఫిర్యాదులు చేయడంతో ఆయనను పోలీసులు అరెస్ట్ చేస్తారనే ప్రచారం ఆదివారం విస్తృతంగా జరిగింది. ఈ క్రమంలో శనివారం గుడివాడలో బీసీ మహిళా అయిన జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికపై టీడీపీ నాయకులు దాడి చేశారని, ఈ అంశాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం చేయాలని పేర్ని నాని ఫోన్‌లో మాట్లాడుతున్న వీడియో వైరల్ అయ్యింది. దీంతో ఈ అంశంపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకుంటారు అనే అంశంపై ఉత్కంఠ నెలకొంది. ఏఎస్పీ సత్యనారాయణ, బందరు డీఎస్పీ సీహెచ్ రాజా, పలువురు సీఐలు, ప్రత్యేక పోలీస్ బలగాలతో పేర్నినాని ఇంటి వద్దకు వచ్చారు. ఆ సమయంలో పేర్నిని అరెస్ట్ చేస్తారనే ప్రచారం జరిగింది. దీంతో వైసీపీ శ్రేణులు పేర్ని ఇంటి వద్దకు చేరుకున్నారు. పెడన నియోజకవర్గంలో జరిగే వైసీపీ సమావేశానికి వెళ్ల వద్దని, పరిస్థితులు అదుపుతప్పేలా ఉన్నాయని, తమకు సహకరించాలని పోలీసులు పేర్ని నానికి వివరించారు. అయినప్పటికీ తాను పెడనలో జరిగే కార్యక్రమానికి వెళతానని చెప్పిన ఆయన, అన్నట్టుగానే పెడనలో జరిగిన వైసీపీ సమావేశానికి హాజరయ్యారు. అవనిగడ్డ మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు పేర్ని ఇంటికి వచ్చి మంతనాలు జరిపారు.

ఎస్పీని కలిసిన వైసీపీ జెడ్పీటీసీలు

గుడివాడలో జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికను అడ్డగించి, ఆమె కారు అద్దాలను పగులకొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లాలోని వైసీపీ జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు ఎస్పీ ఆర్.గంగాధరరావును కలిసి వినతిపత్రం అందించారు.

హింసను ప్రేరేపించేలా వ్యాఖ్యలు : ఎమ్మెల్యే

మాజీ మంత్రి పేర్ని నాని వ్యాఖ్యలు హింసను ప్రేరేపించేలా ఉన్నాయని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ అన్నారు. జగన్ కళ్లలో ఆనందం చూడాలనే ఆకాంక్షతో పేర్ని నాని ప్రజలను రెచ్చగొట్టే విధంగా మాట్లాడుతున్నారని విమర్శించారు.

నేను చెబితే పట్టపగలే చేసేయాలని చెబుతా : పేర్ని నాని

పెడనలో జరిగిన వైసీపీ సమావేశంలో పేర్ని నాని మళ్లీ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. చీకట్లో ఎవరినీ చంపేయాలని తాను చెప్పలేదని, చెబితే మాత్రం పట్టపగలే చేయాలని చెబుతానని అన్నారు. ఎవరిపై విమర్శలు చేయని జెడ్పీ చైర్‌పర్సన్ మిగతా 6లో..

టీడీపీ శ్రేణులపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు

గుడివాడ, జూలై 13 (ఆంధ్రజ్యోతి): గుడివాడలో వైసీపీ నియోజకవర్గ కార్యకర్తల సమావేశానికి వెళ్తున్న తనను స్థానిక నాగవరప్పాడు సెంటర్‌లో టీడీపీ నేతలు, కార్యకర్తలు అడ్డగించి, అసభ్యపదజాలంతో దూషించారంటూ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు 126(2), 292, 324(4), 351(2) రెడ్ విత్ 3(5) బీఎన్ఎస్ కింద కేసులు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు.

సాగునీటి ఎద్దడి!

నీరందక ఎండిపోతున్న వరి

- పెడన, బంటుమిల్లి, కృత్తివెన్ను, మచిలీపట్నం, గూడూరు మండలాల్లో పరిస్థితులు దారుణం
- పసుపు రంగులోకి మారుతున్న వెదజల్లిన పొలాలు
- ప్రధాన కాలువలకు వదిలినా శివారు భూములకు చేరని నీరు
- ఆందోళనలో అన్నదాతలు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: పెడన నియోజకవర్గం లోని బంటుమిల్లి, కృత్తివెన్ను, పెడన, గూడూరు, మచిలీపట్నం మండలంలో వెదజల్లే పద్ధతిలో సుమారు 15వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. విత్తనాలు జల్లి 15 నుంచి 20 రోజులు గడిచింది. మొలకలు వచ్చిన తర్వాత ఆశించిన స్థాయిలో వర్షాలు కురవక పోవడంతోపాటు, కాలువలకు పూర్తిస్థాయిలో నీరు విడుదల కాకపోవడంతో పైరు ఎదుగుదల లోపించి పసుపు రంగులోకి మారిపోతోంది. అధిక ఉష్ణోగ్రతల ధాటికి లేత దశలో ఉన్న వరిపైరు వడలిపోతోంది. కాలువల ద్వారా వస్తున్న కొద్దిపాటి నీటిని కాలువ పక్కన ఉన్న రైతులు ఆయిల్ ఇంజన్లతో తోడేస్తున్నారు. కాలువలకు దూరంగా ఉన్న పొలాలకు నీటిని ఇంజన్ల ద్వారా పంపింగ్ చేసేందుకు అవకాశం లేకపోవడంతో నారుమడులు, వెదజల్లిన పొలాల్లోని వరిపైరు చనిపోయేందుకు సిద్ధంగా ఉంది.

వారం క్రితమే నీటిని విడుదల చేసినా..

బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లో వెదజల్లే పద్ధతిన వరి సాగు చేయగా, సరిపడినంతగా నీరు లేక పైరు ఎండిపోతుండటంతో రైతులంతా ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ దృష్టికి సమస్యను తీసుకువెళ్లారు. దీంతో వారం రోజుల క్రితం గుడ్లవల్లేరు వద్ద పుల్లేటి కాలువ నుంచి కృత్తివెన్ను, బంటుమిల్లి మండలాలకు సాగునీటిని సరఫరా చేసే బంటుమిల్లి చానల్ గేట్లు ఎత్తి నీటిని విడుదల చేశారు. అప్పటినుంచి 500 క్యూసెక్కుల నీటిని బంటుమిల్లి చానల్‌కు విడుదల చేస్తున్నారు. అయితే ఎండలు అధికంగా ఉండటంతో బంటుమిల్లి చానల్‌కు ఎగువన ఉన్న గ్రామాల రైతులు ఆయిల్ ఇంజన్‌లు పెట్టి కాలువ నీటిని పొలాలకు మళ్లిస్తున్నారు. దీంతో దిగువ ప్రాంతాలకు సాగు నీరు పూర్తిస్థాయిలో చేరడం లేదు. బంటుమిల్లి చానల్‌లో మల్లేశ్వరం వంతెన వద్ద 4.50 అడుగుల నుంచి 5 అడుగుల వరకు నీటిమట్టం ఉండాలి. కానీ ఆదివారం నాటికి ఈ వంతెన వద్ద కేవలం మూడు అడుగుల మేర నీటిమట్టం ఉంది. అడుగున్నర నుంచి రెండు అడుగుల మేర నీటి మట్టం కాలువలో తక్కువగా ఉండటంతో సాగునీరు పూర్తిస్థాయిలో దిగువ ప్రాంతాలకు చేరడంలేదు.

బందరు, గూడూరు మండలాల్లోనూ..

రామరాజుపాలెం, సీనాయి కాలువల ద్వారా బందరు, గూడూరు మండలాల్లోని పొలాలకు సాగునీరు అందాల్సి ఉంది. బందరు మండలంలోని అరిసేపల్లి, బుద్దాలపాలెం, కానూరు తదితర గ్రామాలకు, పెడన, గూడూరు మండలాల్లోని పలు గ్రామాలకు సాగునీరు రామరాజుపాలెం కాలువ ద్వారానే అందాలి. ఈ కాలువకు నీటిని వదిలినా దిగువ ప్రాంతాలకు నీరు చేరడంలేదు. బందరు మండలంలోని అరిసేపల్లి, చిట్టిపాలెం, బుద్దాలపాలెం, కానూరు తదితర ప్రాంతాలకు పూర్తిస్థాయిలో నీరు రావడం లేదు. ఈ గ్రామాల్లో వెదజల్లే పద్ధతిన సాగు చేసిన పొలాల్లోని పైరు ఎండిపోయే స్థితికి చేరుకుంది.



బందరు మండలం బుద్దాలపాలెం సమీపంలో నీరు లేక ఎండిపోతున్న వరిపైరు

500 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నాం

పుల్లేరు కాలువ ద్వారా బంటుమిల్లి చానల్‌కు 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నాం. కానీ ఎగువ ప్రాంత రైతులు నాట్లు వేసిన పొలాల్లోని పైరును కాపాడుకునేందుకు ఇంజన్‌ల ద్వారా నీటిని తోడుతున్నారు. దీంతో దిగువ ప్రాంతాలకు సరిపడా నీరు వెళ్లడంలేదు. ఒకటీ, రెండు రోజుల్లో పరిస్థితిని చక్కదిద్దుతాం.

- రాజ్యలక్ష్మి, బంటుమిల్లి నీటిపారుదలశాఖ ఏఈ

పైరు ఎండుతోందని రైతుల ఆందోళన

మచిలీపట్నం టౌన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): బందరు మండలం కానూరు, జింజేరు, తాళ్లపాలెం చుట్టుపక్కల గ్రామాల్లో పొలాలకు నీరు అందకపోవడంతో ఆదివారం రాత్రి కానూరులో రైతులు ఆందోళనకు దిగారు. రామరాజుపాలెం కాలువ ఆయకట్టులోని 21 వేల ఎకరాలు, కానూరు తదితర ప్రాంతాల్లోని ఏడు వేల ఎకరాలకు సాగునీరందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రావెళ్ల ఫణికిరణ్, డీఈ అపర్ణ, ఏఈ హరీష్, కృష్ణాజిల్లా తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ అక్కడికి చేరుకుని రైతులతో మాట్లాడారు. వంతుల వారీగా సాగునీరందిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. డీసీ చైర్మన్ స్వామినాయుడు, వైస్ చైర్మన్ శాయన శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఆదివారం రాత్రి కానూరులో రైతులతో మాట్లాడుతున్న ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రావెళ్ల ఫణికిరణ్

అవినీతి.. అరాచకాలు

వైసీపీ నేత ఉప్పాల రాము తీరిది

- ఉమ్మడి కృష్ణా జెడ్పీ అనధికారిక చైర్మన్‌గా అక్రమాలు
- అధికారులు, ఉద్యోగులపై తీవ్ర వేధింపులు
- సొంత అవసరాలకు జెడ్పీ కార్లు యథేచ్ఛగా వినియోగం
- హైదరాబాద్ నుంచి బందరుకు మద్యం తరలింపు!
- గుడివాడలో టీడీపీ శ్రేణులను దూషించడంతో మళ్లీ వార్తల్లోకి..

వైసీపీ పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రాము వ్యవహారశైలిపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. భార్య జెడ్పీ చైర్‌పర్సన్‌గా ఉన్నా అన్నీ తానే అన్నట్టు వ్యవహరించి అనేక అక్రమాలకు తెరతీసినట్టు ఆరోపణలు ఉన్నాయి. జెడ్పీ కారులను సొంత అవసరాలకు వినియోగించడంతో పాటు ఆయిల్ దోపిడీకి పాల్పడినట్టు విమర్శలు వస్తున్నాయి. తాత్కాలిక ఉద్యోగులు, ఉద్యోగుల బదిలీలు వంటి అనేక విషయాల్లో అవినీతికి పాల్పడినట్టు సమాచారం. మాజీ మంత్రి పేర్ని నాని డైరెక్షన్‌లో శనివారం గుడివాడలో జరిగిన ఘటన నేపథ్యంలో టీడీపీ శ్రేణులను బండ బూతులు తిడుతూ దూషించడం చర్చనీయాంశంగా మారింది.



గుడివాడలో టీడీపీ శ్రేణులను దూషిస్తున్న రాము

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): వైసీపీ ప్రభుత్వంలో, కూటమి ప్రభుత్వంలోనూ వైసీపీ పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి, జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక భర్త ఉప్పాల రాము అరాచకాలు అన్నీ ఇన్నీ కావు. జెడ్పీ చైర్మన్ తానే అన్నట్టు నిర్ణయాలు తీసుకుంటున్నారని విమర్శలు ఉన్నాయి. జెడ్పీ చైర్‌పర్సన్‌కు ప్రోటోకాల్ ప్రకారం కారు సదుపాయం ఉంది. దీన్ని అనధికారికంగా ఉపయోగిస్తున్నట్టు తెలిసింది. కారుకు ఇచ్చిన పరిమితికి మించి ఆయిల్ కొట్టించుకుని సుదూర ప్రాంతాలకు ప్రయాణించేవారని సమాచారం. పెడనలోని ఓ పెట్రోల్ బంకులో ఖాతా ఉందని, ఇక్కడ ఇష్టానుసారం జెడ్పీ కార్లకు ఆయిల్ కొట్టించుకుంటున్నారని తెలిసింది. నెలకు ఇచ్చిన వినియోగ పరిమితి దాటి మరీ ఆయిల్ ఉపయోగిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. హైదరాబాద్‌కు తరచూ జెడ్పీ కార్లను వేసుకుని వెళ్లేవారని, జెడ్పీ కారు డ్రైవర్‌ను పక్కన పెట్టి, సొంత డ్రైవర్‌ను తీసుకుని ఒకసారి హైదరాబాద్ వెళ్లారని, ఆ సమయంలో పెద్ద డబ్బాల్లో ఆయిల్ నింపుకుని కారులో తీసుకుని మరీ వెళ్లటం చర్చనీయాంశమైంది. అప్పట్లో జెడ్పీ అధికారులు ఈ వ్యవహారాన్ని గుర్తించారు. వైసీపీ ప్రభుత్వంలో జెడ్పీ చైర్‌పర్సన్ కారులోనే తెలంగాణ నుంచి మద్యం కేసులను తీసుకువచ్చి బందరులోని తన బార్‌కు తరలించేవారని ఆరోపణలు ఉన్నాయి. దీనిపై అప్పట్లో 'ఆంధ్రజ్యోతి' కథనం కూడా ప్రచురించింది. జెడ్పీ అధికారులు ఉలిక్కిపడి దీనిపై విచారణ కూడా జరిపారు.

పని చేయకపోయినా జీతాలు ఇప్పిస్తూ..

జెడ్పీలో తాత్కాలిక ఉద్యోగులుగా మిగతా 6లో..



దుర్గమ్మకు ఆషాఢ సారె సమర్పిస్తున్న భక్త బృందాలు

ఇంద్రకీలాద్రిపై పోటెత్తిన భక్తులు

» దుర్గమ్మను లక్ష మంది దర్శించుకున్నారని అంచనా

» మధ్యాహ్నం సమయానికే 50 వేల మందికి పైగా రాక

ఇంద్రకీలాద్రి, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రి దుర్గా మల్లేశ్వర దేవస్థానంలో కనకదుర్గమ్మ దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఆషాఢ మాస సారె సమర్పణలకు వివిధ ప్రాంతాల



నుంచి భక్తులు తరలివచ్చారు. ఆదివారం కావటంతో వేకువజాము నుంచే భక్తులు సారె సమర్పించుకోవటానికి భక్తులు సమూహాలుగా తరలి వచ్చారు. ఈవో శీనానాయక్ భక్తులకు సౌకర్యాల పట్ల పర్యవేక్షణ చేసి సిబ్బందికి తగు సూచనలు చేశారు. టిక్కెట్ దర్శనాలన్నింటినీ రద్దు చేసి, అన్ని లైన్లను ఉచిత దర్శనం కోసం వీలు కల్పించారు. వాటర్ బాటిల్స్ బిస్కెట్‌లు పంపిణీ చేశారు. ఉచిత ప్రసాద పంపిణీ, అన్నప్రసాద వితరణ కొనసాగాయి. ఎండ ఎక్కువగా ఉండటంతో ఘాట్ రోడ్డు ప్రాంతాల్లో షామియానాలు ఏర్పాటు చేయింశారు.



కనకదుర్గమ్మకు పోలీసు శాఖ ఆషాఢ సారె

ఇంద్రకీలాద్రి: విజయవాడ నగర పోలీసు శాఖ తరఫున కనకదుర్గమ్మకు ఆషాఢ మాస సారె సమర్పించారు. డప్పులు, వేషధారణలు, పోలీసు సిబ్బంది కోలాహలం మధ్య ఊరేగింపుగా ఘాట్ రోడ్డుమీదుగా అమ్మవారి ఆలయానికి నగరపోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు దంపతులు, పోలీసు అధికారులు వెంట రాగా 30 పోలీసు కుటుంబాలు అమ్మవారికి సారె సమర్పించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు అనంతరం అర్చకుల ఆశీస్సులను అందుకున్నారు. పోలీసు కమిషనర్ బృందానికి ఈవో శీనానాయక్, ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలను అందజేశారు. అదనపు డీసీపీలు గుణ్ణం రామకృష్ణ, ప్రసన్నకుమార్, వెస్ట్ ఏసీపీ దుర్గారావు, ట్రాఫిక్ ఏసీపీ రామచంద్రరావు, సిఎస్‌డబ్ల్యు ఎస్.వి. ప్రసాద్, వన్‌టౌన్ సీఐ గురు ప్రకాష్, సీఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ సరళ, ఏఎస్ఐ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజా వినతుల స్వీకరణ

కలెక్టరేట్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా సోమవారం ప్రజల నుంచి పీజీఆర్ఎస్ అర్జీలు స్వీకరించనున్నట్టు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్, డివిజన్, మున్సిపల్, మండల కేంద్రాల్లో సంబంధిత అధికారులు ప్రజలకు అందుబాటులో వుంటారని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, అర్జీలను మీకోసం ఏపీజీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లోనూ నమోదు చేసుకోవచ్చని చెప్పారు.నమోదైన అర్జీల స్థితి, సంబంధిత సమాచారం తెలుసుకొనేందుకు 1100కి కాల్ చేయవచ్చన్నారు.

నేడు జాతీయ ఎస్సీ కమిషన్ సమీక్ష

కలెక్టరేట్ : జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు (నేషనల్ కౌన్సిల్ ఫర్ షెడ్యూల్డ్ క్యాస్ట్) వడ్డేపల్లి రాంచందర్ సోమవారం ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. జిల్లాలో షెడ్యూల్ కులాల జనాభా స్థితిగతులు, కేంద్ర రాష్ట్రప్రభుత్వాల సంక్షేమ పథకాల లబ్ధి, వారు నివసిస్తున్న ప్రాంతాల్లో మౌలిక వసతులు పరిస్థితి, ప్రభుత్వపరంగా వారికి కల్పించిన సౌకర్యాలు, తీసుకొంటున్న చర్యలు తదితర అంశాలపై అధికారులతో కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రాంచందర్ సమీక్ష నిర్వహించనున్నారు. ఎన్‌సీఎస్సీ డైరెక్టర్ జి.సునీల్‌కుమార్ బాబు పాల్గొంటారు.

ఫోటో జర్నలిస్టుల ఐక్యత తక్షణ అవశ్యకత

గాంధీనగర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఫోటో జర్నలిస్టులపై తరచూ జరుగుతున్న భౌతిక దాడులపై ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఏపీయూడబ్ల్యూజే) నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. ఫోటో జర్నలిస్టుల ఐక్యత తక్షణ ఆవశ్యకత అని ఉద్ఘాటించారు. యూనియన్ అనుబంధ ఏపీ ఫోటో జర్నలిస్ట్ అసోసియేషన్ (ఏపీపీజేఏ) సర్వసభ్య సమావేశం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఏపీయూడబ్ల్యూజే ప్రధానకార్యదర్శి కంచల జయరాజ్, మాజీ ప్రధానకార్యదర్శి చందు జనార్దన్‌లు మాట్లాడారు. ఏపీపీజేఏకు యూనియన్ అండగా ఉంటుందన్నారు. ఫోటో జర్నలిస్టులపై దాడులను అరికట్టేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సమావేశం రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఏపీపీజేఏ గౌరవాధ్యక్షుడిగా జీవీ నారాయణ, అధ్యక్షుడిగా సీహెచ్.వీఎస్ విజయభాస్కరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వి.రూబెన్ బెసాలియల్, ప్రధానకార్యదర్శిగా జి.మహేష్, కోశాధికారిగా సీహెచ్ నారాయణరావు తదితరులతో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.



నిరుపేద ఆకురాతి సాంబయ్య నివాస గృహం కట్టించిన రామకృష్ణ

పీ4కు ఆదర్శంగా.. నిరుపేదకు అండగా..

కోడూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : కోడూరు పంచాయతీ పరిధిలోని స్థానిక ఐదో వార్డులో నివాసముంటున్న నిరుపేద ఆకురాతి సాంబయ్యకు చెందిన ఇల్లు ఇటీవల అగ్ని ప్రమాదంలో పూర్తిగా దగ్ధమైంది. సాంబయ్యను బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కొండవీటి రామకృష్ణ పరామర్శించి నిత్యావసర సరుకులు, బియ్యం అందజేశారు. అనంతరం ఇచ్చిన హామీ మేరకు 16 వేలతో సాంబయ్యకు రేకుల షెడ్డుతో గృహాన్ని ఏర్పాటు చేశారు. కూటమి ప్రభుత్వ పీ4 పథకం ఆదర్శంగా సాయం చేసినట్టు రామకృష్ణ తెలిపారు.

చిత్ర పరిశ్రమకు.. పెట్టని కోట



చిత్ర పరిశ్రమలో ఒక ధ్రువతారగా.. తెలుగు సినీరంగంలో విలక్షణ నటుడిగా వెలుగొందారు కోట శ్రీనివాసరావు. సినిమాల్లో ఏ పాత్ర ఇచ్చినా అందులో పరకాయ ప్రవేశం చేసి ప్రేక్షకుల హృదయాలను దోచుకునేవారు. చిత్ర పరిశ్రమ చరిత్రలో తనకంటూ ఓ ప్రత్యేక స్థానం సంపాదించుకుని బహుముఖ ప్రజ్ఞాశాలిగా ఎదిగి పద్మశ్రీ, నంది, జూరీ అవార్డులను సొంతం చేసుకున్నారు. కోట మృతితో ఉమ్మడి కృష్ణా కళారంగం తీవ్ర విషాదంలో మునిగిపోయింది.

» 750 సినిమాల్లో నటించి తనదైన ముద్ర

» తెలుగు సినిమా రంగంలో ఓ ధ్రువతార

» కోట మృతితో విషాదంలో కళాకారులు

(ఆంధ్రజ్యోతి, మచిలీపట్నం టౌన్)

1942 జూలై 10న కంకిపాడులో వైద్యుడు సీతారామాంజనేయులు, సుశీల దంపతులకు కోట శ్రీనివాసరావు జన్మించారు. తండ్రి వైద్యుడిని చేద్దామనుకుంటే కోట శ్రీనివాసరావు నటుడయ్యారు. కళాశాల రోజుల్లోనే కోటకు నాటకాలంటే మక్కువ. సినిమాల్లోకి వచ్చేముందు ఆయన స్టేట్‌బ్యాంకులో పనిచేశారు. ఆయన భార్య రుక్మిణి, కుమారుడు కోట వెంకట ఆంజనేయప్రసాద్. ఆంజనేజప్రసాద్ సిద్ధం, గాయం-2 చిత్రాల్లో నటించాడు. 2010జూన్‌లో జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో ఆంజనేయ ప్రసాద్ మృతి చెందాడు.

చలన చిత్రరంగంలో కోట ప్రస్థానం

750 చిత్రాలలో నటించిన కోట శ్రీనివాసరావు చలన చిత్రరంగంలో తనదైన ముద్ర వేసుకున్నారు. తెలుగులోనే కాకుండా తమిళం, హిందీ, కన్నడ, మళయాళ చిత్రాల్లో ఆయన నటించారు. 1978లో ప్రాణం ఖరీదు చిత్రంతో కోట శ్రీనివాసరావు చలన చిత్ర జీవితాన్ని ప్రారంభించారు. దర్శకుడు రాజమౌళి గౌరవంగా మాస్టర్ అని పిలిచేవారు. ఎక్కువ సినిమాల్లో విలన్ కారెక్టర్ వేసినా.. కమెడియన్‌గా ఆయనకు ఆయనే సాటి. 'అహనా పెళ్ళంట' సినిమాలో బ్రహ్మానందంతో కలిసి చేసిన కామెడీ అందరి హృదయాల్లో నిలిచిపోయింది. 2023లో 'మాయాబజార్ ఫర్ సేల్' సినిమా అందరి హృదయాల్లో నిలిచిపోయింది. ఆయన నటించిన హరిహర వీరమల్లు సినిమా ఇంకా రిలీజ్ కాలేదు.

2015లోనే పద్మశ్రీ

కోట శ్రీనివాసరావును భారత ప్రభుత్వం 2015లో ప్రతిష్ఠాత్మక పద్మశ్రీ అవార్డు ఇచ్చి గౌరవించింది. 2012లో 'కృష్ణం వందే జగద్గురుం' చిత్రానికి ఈ అవార్డు అందుకున్నారు. మొత్తం తొమ్మిది నంది అవార్డులను ఆయన అందుకున్నారు.



ఎదురుమొండి దీవుల పర్యటన సందర్భంగా కోట శ్రీనివాసరావు, మండలి బుద్ధప్రసాద్ (ఫైల్ ఫొటో)

కృష్ణాజిల్లాతో అనుబంధం..

కృష్ణాజిల్లాతో కోట శ్రీనివాసరావుకు విడదీయరాని అనుబంధం. విజయవాడలో సినిమాల్లో వీరు నటించిన సందర్భాల్లో కంకిపాడు వెళ్లి బంధువులు, స్నేహితులను కలిసేవారు. 83 ఏళ్ల కోట శ్రీనివాసరావు తుది శ్వాస వరకు నటనలో జీవించారు. ఎన్టీరామారావు, అక్కినేని నాగేశ్వరరావు, కృష్ణ, శోభన్‌బాబు, చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేష్, నాగార్జునలతో వంటి అగ్ర నటులతో కలిసి పనిచేశారు. పేద బ్రాహ్మణ విద్యార్థులకు సాయం చేసేవారని బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ అధ్యక్షుడు వేమూరి ఆనందసూర్య పేర్కొన్నారు. కోట శ్రీనివాసరావుకు మచిలీపట్నంలో రచయిత నాదెళ్ల పురుషోత్తమశాస్త్రి, కవి అద్దేపల్లి రామ్మోహనరావు వంటి ప్రముఖులతో పరిచయాలున్నాయి. కోట మృతిపట్ల కృష్ణాజిల్లా రంగస్థల కళాకారుల సంఘం, బ్రాహ్మణ సేవాసంఘాల ప్రతినిధులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశాయి.

బెజవాడతో అనుబంధం..

» 'తూర్పు' ఎమ్మెల్యేగా ప్రజాసేవ

(ఆంధ్రజ్యోతి - విజయవాడ)

విలక్షణ నటుడిగా ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న కోట శ్రీనివాసరావు రాజకీయాల్లోను స్వచ్ఛమైన నేతగా ముద్ర వేసుకున్నారు. రాజకీయాల్లో కొన్నేళ్లే ఉన్నా.. ఎలాంటి అవినీతి మరకలను ఆయన అంటించుకోలేదు. ప్రజాసేవలో అభివృద్ధిపైనే ఆలోచించారు. ఆ తర్వాత రాజకీయాల్లో తాను సరిపోనని భావించి దూరమయ్యారు. విజయవాడ తూర్పు ఎమ్మెల్యే(బీజేపీ)గా కోట శ్రీనివాసరావు 1999 నుంచి 2004 వరకు పనిచేశారు. అప్పటికే చిత్ర రంగంలో శ్రీనివాసరావు అనేక అవార్డులను అందుకున్నారు. విజయవాడ తూర్పు స్థానం నుంచి సినీనటులకు అవకాశం ఇవ్వాలని బీజేపీ భావించింది. 1999 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఐలాపురం వెంకయ్యపై 57,047 ఓట్లతో విజయం సాధించారు. ఎమ్మెల్యేగా కోట శ్రీనివాసరావు, ఎంపీగా గద్దె రామ్మోహనరావు ఉన్నారు.

విజయవాడ నగరంలో తొలి ఫ్లైఓవర్ కోట శ్రీనివాసరావు హయాంలోనే వచ్చింది. ప్రస్తుతం ఉన్న అజిత్‌సింగ్ నగర్ ఫ్లైఓవర్‌ను ఆయన ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే నిర్మించారు. నాడు అజిత్‌సింగ్ నగర్, పాయకాపురం, వాంబేకాలనీ ప్రాంతాలను విజయవాడ నగరంతో అనుసంధానం చేయడానికి ఫ్లైఓవర్ అవసరమని భావించి దానిని పూర్తిచేయించారు. ప్రస్తుతం ఉన్న బీఆర్టీఎస్ రోడ్డు నిర్మాణం కోట శ్రీనివాసరావు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే జరిగింది. ఇంతకుముందు ఇక్కడ రైల్వేలైన్ ఉండేది. దానిని తొలగించి బీఆర్టీఎస్ రోడ్డు నిర్మాణం చేయించారు. ఈ రెండే కాకుండా కాల్వలపై ఇప్పుడున్న చిన్నచిన్న వంతెనల నిర్మాణానికి కోట శ్రీకారం చుట్టారు.

గద్దెరామ్మోహన్‌తో ఆత్మీయ బంధం

కోట శ్రీనివాసరావు తూర్పు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు గద్దె రామ్మోహనరావు విజయవాడ ఎంపీగా ఉన్నారు. గద్దె టీడీపీ తరఫున, కోట బీజేపీ తరఫున పోటీ చేశారు. ఈ ఇద్దరి మధ్య రాజకీయాలకు ముందే మంచి అనుబంధం ఉంది. గద్దె రామ్మోహనరావును ఆయన తమ్ముడు అని సంబోధిస్తుండేవారు. గద్దె విద్యాభ్యాసం గన్నవరం ప్రభుత్వ కళాశాలలో సాగింది. అదే కళాశాలలో కోట శ్రీనివాసరావు తమ్ముడు కోట శంకర్రావు చదువుకునేవారు. నాటి నుంచే ఇద్దరి మధ్య అనుబంధానికి బీజం పడింది. ఆంధ్రా యూనివర్సిటీ నాటిక పోటీల్లో కళ్లు అనే సాంఘిక నాటకంలో శంకర్రావు కథానాయకుడిగా, రామ్మోహనరావు కథానాయికగా నటించారు. ఈ నాటకానికి కోట శ్రీనివాసరావు దర్శకుడిగా పనిచేశారు. కంకిపాడులోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఉద్యోగం చేస్తూ రోజూ సాయంత్రం పూట గన్నవరం వెళ్లేవారు. కళాశాలలో వీరితో రాత్రి పదిగంటల వరకు రిహార్సల్స్ చేయించేవారు. యూనివర్సిటీ స్థాయిలో గద్దెకు ఉత్తమ కథానాయిక అవార్డు దక్కింది. అప్పటి నుంచే తమ మధ్య అనుబంధం ఏర్పడిందని గద్దె రామ్మోహనరావు చెబుతున్నారు. రాజకీయాల నుంచి దూరమైనా తరచుగా ఫోన్‌చేసి యోగక్షేమాలు తెలుసుకునేవారని నాటి జ్ఞాపకాలను గద్దె గుర్తు చేసుకున్నారు.

కోట శ్రీనివాసరావు మృతి దురదృష్టకరం

- విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని

వన్‌టౌన్ : సీనియర్ నటుడు, పద్మశ్రీ కోటా శ్రీనివాసరావు మృతి దురదృష్టకరమని విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని ఆదివారం ఓ ప్రకటనలో సంతాపం తెలిపారు. చిత్రరంగంలో కోట శ్రీనివాసరావు ఒక ప్రత్యేక తరహా నటుడిగా ప్రేక్షకుల హృదయాలలో ఎప్పటికి గుర్తుండిపోయే చిరస్మరణీయమైన వ్యక్తి అని పేర్కొన్నారు. సినీరంగంలో ఎన్నో వైవిధ్యమైన పాత్రలతో 750 సినిమాల్లో నటించి జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారని కొనియాడారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ ఆయన కుటుంబసభ్యులకు సానుభూతిని తెలిపారు.

చిత్ర కళా శోభితం.. కృష్ణాతీరం

» ఫ్లోర్ పెయింటింగ్ డ్రాయింగ్ పోటీల్లో పెయింటింగ్ వేసిన కలెక్టర్

» ప్రతివారం హరిత బెరంపార్క్‌లో సృజనాత్మక కార్యక్రమాలు

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ





బెరంపార్క్‌లో కళానైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్న యువత, చిన్నారులు

విద్యాధరపురం, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ పున్నమి ఘాట్ వద్ద హరిత బెరం పార్క్‌లో ఆదివారం నిర్వహించిన ఫ్లోర్ పెయింటింగ్, డ్రాయింగ్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఇదే స్ఫూర్తితో ప్రతివారం బెరంపార్క్‌లో సృజనాత్మక కార్యక్రమాలు నిర్వహిస్తామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. ఫోటోగ్రఫీ, యోగా, స్విమ్మింగ్, కార్యక్రమాలను నిర్వహిస్తామని ఆయన ప్రకటించారు. కార్యక్రమాల్లో పర్యాటకులు పెద్ద ఎత్తున భాగస్వాములు కావాలని ఆయన



పెయింటింగ్ వేస్తున్న కలెక్టర్ కుటుంబసభ్యులు

ఆకాంక్షించారు. జిల్లా అధికార యంత్రాంగం విజయవాడ నగరపాలక సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం బెరంపార్క్‌లో నిర్వహించిన డ్రాయింగ్ పోటీలు, ఫ్లోర్ పెయింటింగ్ పోటీలకు 300 మందికి పైగా పాల్గొని తమ ఆలోచనలకు పదును పెట్టారు. స్వర్ణాంధ్ర విజన్-2047, పి-4, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం, స్వచ్ఛాంధ్ర, సేవ్ వాటర్, హరితాంధ్ర, రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్ అంశాల ప్రాతిపదికగా వేసిన వర్ణచిత్రాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కృష్ణాతీరం కొత్త శోభను సంతరించుకుంది. స్వయంగా కలెక్టర్ కుటుంబసభ్యులతో పెయింటింగ్ వేసి ఆకట్టుకున్నారు. అనంతరం విజేతలకు కలెక్టర్ లక్ష్మీశ, మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్రలు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పెయింటింగ్, డ్రాయింగ్ పోటీల ఉత్సాహం మరింత ప్రోత్సాహం ఇచ్చిందని, ప్రతివారం ఒక ఈవెంట్‌ను కృష్ణాతీరాన నిర్వహిస్తామని తెలిపారు. భవానీ ఐలాండ్‌లో పక్షుల ఫోటోగ్రఫీ పోటీలను నిర్వహించనున్నట్టు తెలిపారు. జిల్లాలోని పవిత్ర సంగమం, కొండపల్లి ఖిల్లా, గాంధీ హిల్ తదితర పర్యాటక ప్రాంతాల్లో వివిధ రకాల థీమ్‌లతో కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కేంద్రం ప్రకటించిన స్వచ్ఛ సర్వేక్షణ్-2024 పురస్కారాలలో విజయవాడ నగరానికి సూపర్ స్వచ్ఛతా లీగ్ అవార్డు వచ్చినందుకు, నగర ప్రజలకు, నగరపాలక సంస్థ అధికారులకు, సిబ్బందికి అభినందనలు తెలియజేశారు. కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ, చిన్నారులు, యువతకు పర్యావరణం, జలవనరులు, కాలుష్యదుష్పరిణామాలు తదితర అంశాలపై అవగాహన పెంచుకునేందుకు ఇటువంటి పోటీలు ఉపయోగపడతాయని తెలిపారు.

ఫ్లోర్ పెయింటింగ్ విజేతలు

ఫ్లోర్ పెయింటింగ్ విభాగంలో స్వర్ణాంధ్ర విజన్-సేవ్ వాటర్ పెయింటింగ్‌తో జి.తనూజ ప్రథమ స్థానంలో నిలిచి రూ.10వేల నగదు, జ్ఞాపిక, ప్రశంసా పత్రాలను అందుకుంది. పి.యామిని విశాల ద్వితీయ బహుమతిగా రూ.7,500 నగదు, వి.జశ్వంతి రూ.5వేలు నగదును తృతీయ బహుమతిగా అందుకున్నారు. ఎం.సురేష్ రూ.3వేల నగదును నాలుగవ బహుమతి, ఎల్.శ్వేత, పి.రచన, వి.అనురాధ, కె.హవీలజెస్సీ, బి.రోహితలు ప్రోత్సాహక బహుమతులు అందుకున్నారు.

డ్రాయింగ్ పోటీలలో..

ఎం.ఎస్.వైష్ణవ్యకు ప్రథమ బహుమతి, జయాన్‌కు ద్వితీయ, జి.భాష్యశ్రీకు తృతీయ, లక్ష్యజైన్‌కు నాలుగో బహుమతి వచ్చింది. టి.క్రిష్, జి.ఇషికాకృష్ణన్, జి.అద్వి, సాక్ష్యంసుతార్, రామిరెడ్డి, జస్విత లకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. న్యాయ నిర్ణేతలుగా పి.చిందబరేశ్వరరావు, కళాసాగర్ పి.రమేష్, సంతోష్‌కుమార్‌లు వ్యవహరించారు. మునిసిపల్ కార్పొరేషన్ అదనపు కమిషనర్ జి.చంద్రశేఖర్, ఏపీటీడీసీ డివిజనల్ మేనేజర్ పి.కృష్ణచైతన్య, అమరావతి బోటింగ్ క్లబ్ సీఈవో తరుణ్ కాకాని, జిల్లా టూరిజం అధికారి ఎ.శిల్ప, ఆయుష్ అధికారి డాక్టర్ రత్నప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.



కొత్తపేట సీఐ కొండలరావుకు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నేతలు

పేర్ని నానిపై చర్యలు తీసుకోండి

» కొత్తపేట స్టేషన్‌లో టీడీపీ మైనార్టీ నేతల ఫిర్యాదు

చిట్టినగర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ ప్రజలను, వైసీపీ కార్యకర్తలను రెచ్చగొడుతున్న మాజీ మంత్రి పేర్ని నానిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆదివారం కొత్తపేట స్టేషన్‌లో పలువురు టీడీపీ మైనార్టీ నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఫతావుల్లా మాట్లాడుతూ, పేర్ని నాని ఒక సభలో మాట్లాడుతూ ప్రజలను, వైసీపీ కార్యకర్తలను రెచ్చగొడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా మాట్లాడారని, పదే పదే కార్యకర్తలను రెచ్చగొడుతున్నాడన్నారు. ఆయన మాటలు అన్ని ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియాలలో రావడం జరిగిందన్నారు. ఇటువంటి వ్యక్తులు బయట తిరగటం మంచిదికాదని వెంటనే అరెస్టు చేయ్యాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ పశ్చిమ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు సుకాశి సరిత, టీడీపీ మైనార్టీ నాయకులు ఎస్‌కే ఆషా, జాహెద్, అన్సార్. ఇమ్రాన్, మల్లేశ్వరి, పద్మ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

అరాచకవాదులతో జగన్‌రెడ్డి కుట్రలు!



» మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో అరాచకాలకు జగన్‌రెడ్డి తన అనుయాయులు పేర్ని నాని వంటి వారితో కుట్రలు చేస్తున్నారని మంత్రి కొల్లు రవీంద్ర ఆరోపించారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. కన్ను కొడితే చీకట్లో మనిషిని లేపేసి తెల్లవారి మళ్లీ మనమే పరామర్శకు వెళ్లాలనడం వైసీపీ అరాచకానికి నిదర్శనమన్నారు. గుడివాడ సభ పేరుతో రాష్ట్రంలో కులాల మధ్య అలజడులకు ప్లాన్ చేశారన్నారు. ఆడబిడ్డలను అడ్డం పెట్టుకుని నీచ రాజకీయాలు చేయడం సిగ్గుచేటన్నారు. పేర్ని నాని వీడియోతో వైసీపీ నేతల కుట్రలన్నీ బహిర్గతమయ్యాయన్నారు. జగన్‌రెడ్డి వంటి క్రూరుడు రాష్ట్ర రాజకీయాల్లో ఉండటం మన దౌర్భాగ్యమని, కూటమి ప్రభుత్వం అభివృద్ధి కోసం తాపత్రయపడుతుంటే వైసీపీ నాయకులు మాత్రం కుట్రలు, కుతంత్రాలు చేస్తున్నారన్నారు.



మాట్లాడుతున్న బండి రామకృష్ణ

పేర్ని నానికి మతిస్థిమితంలేకే.. : బండి రామకృష్ణ

పదవుల్లేకపోవడంతో మతి స్థిమితం లేక పేర్ని నాని యువతను రెచ్చగొట్టేలా ఏదేదో మాట్లాడుతున్నారని డీసీఎంఎస్ అధ్యక్షుడు బండి రామకృష్ణ ధ్వజమెత్తారు. వాడపాలెంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కన్ను కొట్టండి, చీకట్లో వేసేయండి, పగలు దండేసి పరామర్శించండంటూ పేర్ని నాని వైసీపీ శ్రేణులకు మోటివేషన్ క్లాసులు చెప్పడం అర్థరహితమన్నారు. రౌడీ రాజకీయాలు చేసిన వారు జైళ్లలో ఎలా మగ్గుతున్నారో తెలుసుకోవాలన్నారు.

హైటెన్షన్

(5వ పేజీ తరువాయి)

ఉప్పాల హారికను ఇబ్బంది పెట్టారని, ఆమె కళ్ల నుంచి వచ్చిన ప్రతి కన్నీటి బొట్టు మీకు శాపంగా మారుతుందన్నారు. మంత్రి కొల్లు రవీంద్ర బందరులో స్థలాలు ఆక్రమించుకుని పెద్ద భవంతిని నిర్మిస్తున్నారని, మద్యం దుకాణాల నుంచి, ఇసుక రేవుల నుంచి వచ్చే ముడుపులు తింటున్నారని విమర్శించారు. బందరు కోటలో తొమ్మిది ఎకరాలు ఆక్రమించుకుని ఐస్ ఫ్యాక్టరీ కడుతున్నారని ఆరోపించారు. కృత్తివెన్నులో 45 ఎకరాల భూమిని ఆక్రమించేశారని విమర్శించారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక మాట్లాడుతూ మహిళను అయిన తనను గుడివాడలో టీడీపీ కార్యకర్తలు అవమానించినా, తనపై దాడి చేసినా హోంమంత్రి ఇంత వరకు స్పందించలేదన్నారు.

అవినీతి.. అరాచకాలు

(5వ పేజీ తరువాయి)

పలువురిని నియమించుకున్నారు. ఈ ఉద్యోగులు ఎప్పుడూ కనపడేవారు కాదని, కానీ వారికి నెలనెలా జీతాలు డ్రా అయ్యేవని ఆరోపణలు ఉన్నాయి. జెడ్పీ ఉద్యోగుల బదిలీల వ్యవహారాలన్నీ రాము కనుసన్నల్లోనే జరిగేవని సమాచారం. రాము చేస్తున్న అక్రమాలకు సంబంధించిన విషయాలు ఉద్యోగులు పత్రికలకు సమాచారం ఇస్తున్నారన్న అనుమానంతో పలువురిని సుదూర ప్రాంతాలకు బదిలీ చేయించినట్టు సమాచారం. జెడ్పీ సీఈవో, డిప్యూటీ సీఈవోలను సైతం బండ బూతులు తిడుతూ వారిని భయభ్రాంతులకు గురిచేసినట్టు ఆరోపణలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా సీఈవో, డిప్యూటీ సీఈవోలను వేధించినట్టు సమాచారం.

పనుల్లో కమీషన్లు

అభివృద్ధి పనుల పేరుతో భారీగా కమీషన్లు దండుకున్నట్టు ఆరోపణలు వచ్చాయి. జెడ్పీకి చెందిన ఖరీదైన ఆస్తులను బడా సంస్థలకు కట్టబెట్టి ప్రయోజనాలు పొందాలన్న స్కెచ్ కూడా వేశారన్న విమర్శలు ఉన్నాయి. ఈ క్రమంలో విజయవాడలో కాంప్లెక్స్ పేరుతో బందరు రోడ్డు వెంబడి ఉన్న భవనాలను కూలగొట్టారు. జెసీ బంగళా ఉండటంతో.. అప్పట్లో ఈ స్కెచ్‌ను గమనించిన ఎన్టీఆర్ కలెక్టర్ ఢిల్లీరావు దీనికి అడ్డుకట్ట వేశారు. పిన్నమనేని కోటేశ్వరరావు, కడియాల రాఘవరావు వంటి మహానుభావులు పనిచేసి జెడ్పీకి పేరు ప్రఖ్యాతలు తెస్తే, రాము తన సతీమణి ఉప్పాల హారికను అడ్డం పెట్టుకుని తీరని అప్రతిష్ఠను తీసుకువచ్చారు. అధికారంలో లేకపోయినా సరే తగ్గేది లేదన్నట్టు.. గుడివాడలో టీడీపీ శ్రేణులను దూషించి మరోమారు వివాదంలో చిక్కుకున్నాడు. ఉప్పాల రాముపై కూడా టీడీపీ కార్యకర్తలు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారు. గతంలో జెడ్పీ వేదికగా ఆయన సాగించిన అక్రమాల చిట్టా బయటకు తీయాలని భావిస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	103, 111, 122
చికెన్ విత్ స్కిన్	196
చికెన్ స్కిన్‌లెస్	206

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 515

చంద్రబాబు ముందు చూపు రైతులకు వరం: గూడపాటి



గన్నవరం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు ముందు చూపు రైతులకు వరంగా మారిందని టీడీపీ మండల అధ్యక్షుడు గూడపాటి తులసీమోహన్ అన్నారు. పురుషోత్తపట్నం చెరువులకు పోలవరం కాలువ వద్ద ఏర్పాటు చేసిన మోటార్లను ఆదివారం ఆన్ చేశారు. ఉప సర్పంచ్ పాలడుగు నాని, టీడీపీ నాయకులు గుమ్మడి వెంకట్రా మయ్య, తాటిశెట్టి శ్రీనివాస రావు, మాదల సాంబశివరావు, తుమ్మల లక్ష్మణరావు, మోపర్తి కోటేశ్వరరావు, కుంటముక్కల శివయ్య, అన్నే శ్రీనివాసరావు, చదలవాడ కోటేశ్వరరావు, గుర్రం జయరాజు పాల్గొన్నారు.

వైసీపీ జిల్లా అధ్యక్షుడు పేర్నిపై చర్యలు తీసుకోవాలి: రాజా

కంకిపాడు, జులై 13 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వాన్ని అప్రదిష్ట పాలు చేసేందుకు కుట్రలు పన్నుతున్న వైసీపీ జిల్లా అధ్యక్షుడు పేర్ని నానిపై చర్యలు తీసుకోవాలని మాజీ ఎంపీపీ దేవినేని రాజా అన్నారు. స్థానిక విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడుతూ, బీసీ కార్డు అడ్డుపెట్టుకొని మహిళలపై దాడులు జరిగినట్లు సృష్టించి కూటమి ప్రభుత్వంపైన, లోకేష్‌పైన బురద జల్లే ప్రయత్నం చేయాలంటూ కార్యకర్తలను నాని రెచ్చగొడుతున్నారని మండిపడ్డారు. ప్రజలను రెచ్చ గొట్టే విధంగా మాట్లాడుతున్న వైసీపీ నాయకులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సర్పంచ్ పందిపాటి ఇందిర, సుధాకర్, షకార్ తదితరులు పాల్గొన్నారు.



వెన్నూతలలో గంగానమ్మకు ఆషాఢ సారె తీసుకెళ్తున్న భక్తులు

గ్రామదేవతలకు ఆషాఢ సారె

ఉంగుటూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెన్నూతలలో ఆదివారం గ్రామదేవతలకు ఆషాఢ సారెను భక్తులు సంప్రదాయబద్ధంగా సమర్పించారు. గ్రామపూజారి మామిళ్లపల్లి సుబ్బారావు ఆధ్వర్యంలో గంగానమ్మ గుడి వద్దకు చేరుకుని అమ్మవారికి సామూహికంగా పూజలు నిర్వహించి వెంట తెచ్చిన సారెను సమర్పించారు. పాతూరి శివసీతారాములు, బాజీ, సాంబశివరావు, హనుమంతరావు, కమిటీ సభ్యులు శ్రీదేవి, మాధురి పాల్గొన్నారు.

గన్నవరం : మండలంలోని పురుషోత్తపట్నం భువనేశ్వరీ అమ్మవారికి ఘనంగా ఆషాఢ సారెను సమర్పించారు. వివిధ రకాల స్వీట్లు, పండ్లు, పసుపు, కుంకుమ, గాజులు, పట్టు వస్త్రాలతో కూడిన ఆషాఢ సారెను భక్తి శ్రద్ధలతో అమ్మవారికి సమర్పించారు. గత పదిహేనేళ్ల నుంచి అమ్మవారికి శాకాంబరి అలంకారణ చేస్తున్నట్లు ఆలయ అర్చకులు మురళీధర్ శర్మ తెలిపారు.

అడ్డదిడ్డంగా వాహనాల పార్కింగ్!

- పోలీసుల నో పార్కింగ్ హెచ్చరికలు బేఖాతర్
- రోడ్డుపక్కనే నిలుపుతున్న ఆటోలు.. తోపుడు బండ్లు
- పట్టించుకోని పోలీసులు..
- ఇబ్బంది పడుతున్న ఇతర వాహనదారులు



ఉయ్యూరు ప్రధాన సెంటర్‌లో నోపార్కింగ్ వద్ద నిలిపిన మోటార్ సైకిళ్లు, తోపుడు బండ్లు

(ఉయ్యూరు - ఆంధ్రజ్యోతి)

ఉయ్యూరు ప్రధాన రహదారుల్లో ఎక్కడి పడితే అక్కడ వాహ నాలు, తోపుడు బండ్లు నిలపడంతో వాహనాలు నడిపేవారితో పాటు పాదాచారులకు సైతం అసౌకర్యం కలుగుతుంది. అనునిత్యం రద్దీగా ఉండే రింగ్ సెంటర్ పరిసరాల్లో వాహనాలు నిలపడాన్ని నియంత్రించాలన్న ఉద్దేశంతో పట్టణ పోలీసులు నో పార్కింగ్ బోర్డులు ఏర్పాటు చేసినప్పటికి పట్టించుకోకుండా ద్విచక్రవాహనాలు, తోపుడుబండ్లు, ఆటోలు నిలుపడం వల్ల నడిచి వెళ్లే వారికి సైతం ఇబ్బందికరంగా ఉంటుంది. నోపార్కింగ్ బోర్డులు పెట్టి చేతులు దులుపుకున్న పోలీసులు చర్యలు తీసుకోపోవడంతో రహదారిపై ఎక్కడపడితే అక్కడ రెండు మూడు వరుసల్లో తోపుడు బండ్లు, వాహనాలు, ఆటోలు నిలిపి ట్రాఫిక్ అంతరాయం కలిగిస్తున్నా పోలీసులు చూసి చూడనట్లు వ్యవహరించడం పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా పోలీసులు స్పందించి ట్రాఫిక్ డ్రైవ్ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. అదేవిధంగా తోపుడు బండ్లపై వ్యాపారాలు చేసే వారు ఫుట్‌పాత్ దాటి రోడ్ల మధ్యలోనే రెండు మూడు బండ్లుపెట్టి బల్లవేసు కుని కూర్చుని మరి వ్యాపారం చేస్తూ ట్రాఫిక్‌కు అంతరా యం కలిగిస్తున్నా నగర పంచాయతీ అధికారులు, పోలీసులు ఎవరు పట్టించుకోపోవడం పట్ల స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

రూ.8కోట్లతో రహదారి బ్యూటిఫికేషన్

ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు



గన్నవరం వెటర్నరీ కళాశాల దగ్గర బ్యూటిఫికేషన్ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : గన్నవరం విమానాశ్రయం నుంచి రామవరప్పాడు వరకూ బ్యూటిఫికేషన్ పనులు వేగవంతంగా పూర్తిచేయాలని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం బ్యూటిఫికేషన్ పనులకు రూ.8కోట్లు కేటాయించిందని తెలిపారు. ఆదివారం గన్నవరం వెటర్నరీ కళాశాల దగ్గర జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 13కిలో మీటర్ల పొడవున రూ.8కోట్ల వ్యయంతో పనులు చేపట్టినట్లు తెలిపారు. అంతర్జాతీయ విమానాశ్రయానికి దేశ విదేశాల నుంచి ప్రముఖులు రాకపోకలు సాగిస్తుంటారని చెప్పారు. ఈ నేపథ్యంలో విమానాశ్రయం నుంచి గ్రీనరి అస్తవ్యస్తంగా మారిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం గ్రీనరిని పట్టించుకోకపోవటం వల్ల చూడటానికి బాగా లేదని అందుకే బ్యూటిఫికేషన్ పై ప్రత్యేక దృష్టి సారించి అనేక సార్లు సమీక్ష సమావేశాలు నిర్వహించి అధికారులతో చర్చించటం జరిగిం దన్నారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి నిధులు కేటాయించటంతో పనులు జరుగుతున్నాయన్నారు. పూర్తిస్థాయిలో పనులు పూర్తైతే రహదారి ఆహ్లాదకరంగా ఉంటుందన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేసి పనులు శరవేగంగా పూర్తి చేయాలని సూచించారు. పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



కాంపాక్ట్ వాహనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్, పట్టాభి

డంపింగ్ ఫ్రీ మునిసిపాలిటీగా తాడిగడప

ఎమ్మెల్యే బోడె ప్రసాద్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి

పెనమలూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ సహకారంతో తాడిగడప మునిసిపాలిటీని డంపింగ్ ఫ్రీ మునిసిపాలిటీగా మారుస్తామని ఎమ్మెల్యే బోడె ప్రసాద్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి పేర్కొన్నారు. ఆదివారం ఇరువురూ కలసి మునిసిపల్ అధికారులకు చెత్తను తరలించే కంపాక్ట్ వాహనాలను అప్పగించే కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ, మునిసిపాలిటీలో రోజూ వంద టన్నుల చెత్త సేకరణ జరుగుతోందని, ఆ చెత్త తరలించేందుకు కంపాక్టర్లు అవసరమని మంత్రి నారాయణ దృష్టికి తేగా వాటిని వెంటనే మంజూరు చేయించి అధికారులకు అందిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు నారాయణ, లోకేష్‌లు రాష్ట్రాన్ని డంపింగ్ ఫ్రీ రాష్ట్రంగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నారని తెలిపారు. మునిసిపల్ కమిషనర్ షేక్ నజీర్, వెలగపూడి శంకరబాబు, కోయ ఆనంద్‌ప్రసాద్, యార్లగడ్డ సుచిత్ర, సంగెపు రంగారావు, యేకుల విజయేంద్ర, శొంఠి శివరాంప్రసాద్, దోనెపూడి రవికిరణ్ పాల్గొన్నారు.

బోడె ప్రసాద్, పవన్‌కల్యాణ్‌ను విమర్శించే హక్కు దేవభక్తునికి లేదు: టీడీపీ

పెనమలూరు, జూలై13(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే బోడె ప్రసాద్, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను విమర్శించే నైతిక హక్కు వైసీపీ ఇన్‌చార్జి దేశభక్తుని చక్రవర్తికి లేదని టీడీపీ కూటమి నేతలు పేర్కొన్నారు. పవన్‌కల్యాణ్‌పై, ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌పై వైసీపీ ఇన్‌చార్జి చక్రవర్తి చేసిన అనుచిత వ్యాఖ్యలపై వారు ఆదివారం పోరంకి టీడీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో విరుచుకుపడ్డారు. వైసీపీ హయాంలో కనీసం కానూరు ప్రజలను పట్టించుకోకుండా కాలం వెళ్లదీశారని, ఇలాంటి పనికిమాలిన మాటలు చక్రవర్తి మానుకోకపోతే ఇక ముందు ఊరుకోబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కూటమి నేతలు యార్లగడ్డ సుచిత్ర, తాతపూడి గణేష్, శొంఠి శివరాంప్రసాద్, మల్లంపాటి విజయలక్ష్మి, సంగెపు రంగారావు, వీరమహిళ సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

కాల్వ కట్ట నివాసితుల సమస్యలు తీరుస్తాం

ఎమ్మెల్యే బోడె ప్రసాద్



ఉయ్యూరు 12వ వార్డులో ఇంటింట ప్రచారం చేస్తున్న టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ

పెనమలూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో కాల్వ కట్టలపై నివసించే ప్రజల సమస్యలు, అవసరాలు తీరుస్తామని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం తాడిగడప మునిసిపాలిటీలోని శ్రీనగర్ కట్టపై జరిగిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొని స్థానికులతో మాట్లాడారు. కాలవ కట్టలపై నివసిస్తున్న ప్రజలకు చిన్నచిన్న ఇబ్బందులు ఉన్నాయని గ్రహించామని, రోడ్లు, డ్రైన్ల ఏర్పాటుకు తొలిప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించే కరపత్రాలను పంపిణీ చేశారు. వ్యక్తిగత సమస్యలు, పరిశుభ్రత తదితర అంశాలపై ప్రజలు నేరుగా అవగాహన చేసుకోవడం, అధికారులకు తమ సమస్యలను నివేదించడం లాంటి అంశాలను ప్రజలతో చర్చించారు. కాల్వ కట్టల నివాసితుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

పెనమలూరులో..

పెనమలూరులో జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి మారుపూడి ధనకోటేశ్వరరావు, కోయ ఆనంద్ ప్రసాద్, తోటకూర ఉదయభాస్కర్, గూడవల్లి పూర్ణ, మొర్ల నరేంద్ర, వెలిసెల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికి సంక్షేమ పథకాలు

ఉయ్యూరు : గత ప్రభుత్వ అసమర్ధ పాలనతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉన్నప్పటికి ఎన్నికల హామీలను అమలు చేస్తూ కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాటనిలబెట్టుకున్నారని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉయ్యూరు 12వ వార్డులో పర్యటించి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు తల్లికి వందనం, పింఛను పెంపు, దీపం పథకం ద్వారా మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నారని, ఆగస్టు 15 నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం అమలు చేయనున్నట్టు చంద్రబాబు ప్రకటించారని తెలిపారు. ఉయ్యూరు చైర్మన్ వి.సత్యనారాయణ, మాజీ చైర్మన్లు పూర్ణచంద్రరావు, ఖుద్దూస్, వార్డు కౌన్సిలర్ బూరెల రమణ, టీడీపీ నాయకులు గుర్నాధరావు, కూనపరెడ్డి వాసు, ఫణి, అజ్మతుల్లా, నరేశ్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రజాసేవే సంతృప్తినిచ్చింది

● లయన్స్‌క్లబ్ ఆఫ్ విజయవాడ రూరల్ సెక్రటరీ రావి సురేష్‌బాబు



విజయవాడ, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఇప్పటివరకు గడిపిన జీవితంలో ప్రజాసేవ చేయడం తనకు ఎంతో సంతృప్తి నిచ్చిందని లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ రూరల్ సెక్రటరీ రావి సురేష్‌బాబు అన్నారు. గన్నవరం మండలం కేసరపల్లిలో అమ్మ వయోవృద్ధుల సేవ సాధనలో లయన్స్‌క్లబ్ ఆఫ్ విజయవాడ సురేష్‌బాబు ఆధ్వర్యంలో రూ.10 వేలకు పైగా విలువైన నిత్యావసర సరుకులు, పాలు, గుడ్లు, కూరగాయలు పంపిణీ చేశారు. వీటితో పాటు మందులు, మూడు వేల రూపాయల చెక్ అందజేసి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 100కు పైగా గ్రామాల్లో 130కి పైగా ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు, కళ్ల ఆపరేషన్లు చేయించి కళ్లజోళ్లు ఇవ్వడం జరిగిందన్నారు. 1500కు పైగా మొక్కలు నాటడం, పేద విద్యార్థులకు, వికలాంగులకు ఆర్థిక సాయం చేసామన్నారు. 1000 మందికి పైగా విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేసిన కెరీర్ మీద కౌన్సెలింగ్ ఇచినట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ రూరల్ అధ్యక్షుడు పి.కిరణ్ కుమార్, ట్రెజరీ కె.ఎస్.ఆర్.కె.ప్రసాద్, లోయ సురేంద్ర, డి.సువర్ణబాబు, కేసరపల్లి టీడీపీ నాయకుడు అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇస్కాన్ పాదయాత్రకు ఘనస్వాగతం



హనుమాన్‌జంక్షన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మాన్ని ప్రపంచానికి చాటి చెప్పడమే ఇస్కాన్ యావత్భారత ప్రచార పాదయాత్ర ముఖ్య ఉద్దేశ్యమని పాదయాత్ర ఇన్‌చార్జి ఆచార్యదాస్ తెలిపారు. 2021లో ద్వారకా నుంచి చేపట్టిన 7వ యావత్భారత ప్రచార పాదయాత్ర ఆదివారం హనుమాన్ జంక్షన్ చేరుకుంది. పాదయాత్ర బృందానికి విజయ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు ఆధ్వర్యంలో భక్తులు ఘనంగా స్వాగతం పలికారు. స్థానిక అభయాంజనేయ స్వామి దేవస్థానం వద్ద కొద్ది సేపు హరేరామ హరే కృష్ణ కీర్తనలు ఆలపించి అనంతరం నగర సంకీర్తన నిర్వహించారు. కార్యక్ర మంలో పాదయాత్ర ఏపీ ఇన్‌చార్జి రాధావల్లభదాస్, స్థానిక షిరిడీ సాయి బాబా మందిరం పాలక మండలి చైర్మన్ కొల్లి వెంకట్రావు, యలమంచలి శ్రీరామ చంద్రమూర్తి, గుమ్మడి శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.



విశ్రాంత ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఐసీఎం జూబ్లీ స్కూల్ పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

హనుమాన్‌జంక్షన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : హైస్కూల్ స్థాయిలో ఉపాధ్యాయులు క్రమశిక్షణతో నేర్పిన విద్యా బుద్ధులే జీవితంలో స్థిరపడడానికి దోహదపడ్డాయని స్థానిక ఐసీఎం జూబ్లీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు తెలిపారు. ఆ పాఠశాల 1993-94 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పటి పాఠశాల హెచ్‌ఎంలు జీవానందం, జాన్‌ముడి, మూర్తి ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, వేదరత్నం, రైటర్ విలియంలను సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమాన్ని హరికృష్ణ, శ్రీనివాసరావు, సుబ్రహ్మణ్యం పర్యవేక్షించారు.



కంటి వైద్యంపై అవగాహన అవసరం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూలై 13(ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరికి కంటి వైద్యంపై అవగాహన ఉండాలని నాసా మాజీ శాస్త్రవేత్త చందు సాంబశివరావు అన్నారు. కోడూరుపాడులో వైస్ ఎంపీపీ చందు రమాదేవి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శంకర గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూట్ అండ్ రీసెర్చ్ సెంటర్, తేలప్రోలు సహకారంతో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహకులను అభినందించారు. శంకర కంటి వైద్యశాలకు చెందిన డాక్టర్ నాదెళ్ల స్వాతి ఆధ్వర్యంలో 312మందికి కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి చందు శ్రీనివాసరావు, తాతారావు సహకారంతో మందులను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ యరగొర్ల నగేష్, గాంధీ, కసుకుర్తి శ్రీనివాసరావు, నూకల బాలాజీ, గోవిందయ్య పాల్గొన్నారు.

గొప్ప నటుడిని కోల్పోయాం

టీడీపీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ



కంకిపాడు, జులై 13 (ఆంధ్ర జ్యోతి) : కంకిపాడు ముద్దు బిడ్డ, తన విలక్షణ మైన నటనతో సినీ రంగంలో ఓ వెలుగువెలిగిన గొప్ప నటుడు కోట శ్రీనివాసరావును కోల్పోవడం దురదృష్టకరమని టీడీపీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ అన్నారు. కోట శ్రీనివాసరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తుమ్మలపల్లి మాట్లాడుతూ, కంకిపాడులో పుట్టి ఇక్కడే చదువుకొని ఇక్కడే ఉద్యోగం చేశారన్నారు. సినీ రంగంలో 9 నంది అవార్డులతో పాటు ఓ ఫిల్మ్‌ఫేర్, పద్మశ్రీ అవార్డు అందు కున్న గొప్ప నటుడు కోట శ్రీనివాసరావు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ కో కన్వీనర్ పులి శ్రీనివాసరావు, కొండా నాగేశ్వరరావు, గుడిసేవ నాం చారయ్య, జనసేన పార్టీ నాయకులు పులి కామేశ్వరరావు, బీజేపీ నియోజకవర్గ నాయకులు దివి రోహిణి కుమార్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మెరుగైన కార్పొరేట్ వైద్యం

కంకిపాడు, జులై 13 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన, మెరుగైన కార్పొరేట్ వైద్యం అందించేందుకు పూర్ణ హార్ట్ ఇనిస్టిట్యూట్ ముందుకు రావడం హర్షణీయమని ఈడుపుగల్లు సర్పంచ్ పందిపాటి ఇందిర అన్నారు. ఈడుపుగల్లు పంచాయతీ కార్యాలయంలో పూర్ణ హార్ట్ ఇన్‌స్టిట్యూట్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్యశిబిరాన్ని ఆదివారం ఆమె ప్రారంభించారు. సుమారు 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు.



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	103, 111, 122
చికెన్ విత్ స్కిన్	196
చికెన్ స్కిన్‌లెస్	206

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 515



బాలాత్రిపుర సుందరీదేవికి ఆషాఢ సారె

కూచిపూడి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కూచిపూడిలోని బాలాత్రిపుర సుందరీదేవి అమ్మవారికి భాగవతుల నాగమణి ఆధ్వర్యంలో మహిళలకు ఆషాఢ సారె సమర్పించారు. ఆలయ అర్చకులు పెనుమూడి పూర్ణచంద్రశేఖర శర్మ అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. మహిళలు పూజా కార్యక్రమాల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



బాలాత్రిపుర సుందరిదేవికి ఆషాఢ సారె సమర్పిస్తున్న మహిళలు

దమ్ముచక్రాల ట్రాక్టర్లతో రోడ్లు ధ్వంసం

● పీఎంజీఎస్‌వై నిధులు రూ 4.85 కోట్లతో నిర్మించిన రోడ్డు ● తోట్లవల్లూరు-పెనమకూరు మధ్య దెబ్బతిన్న రోడ్డు

(ఆంధ్రజ్యోతి - తోట్లవల్లూరు) : కోట్లు వెచ్చించి నిర్మించిన తోట్లవల్లూరు-పెనమకూరు జడ్పీ రహదారి దమ్ము చక్రాల ట్రాక్టర్లతో ధ్వంసమయింది. అనేకచోట్ల తారు రోడ్డు ఇనుప చక్రాల ధాటికి నలిగి పాడైపోయింది. ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన(పీఎంజీఎస్‌వై) నిధులు రూ 4.85 కోట్లతో రెండేళ్ల క్రితం తారురోడ్డు నిర్మించారు. మండల కేంద్రమైన తోట్లవల్లూరుకు వచ్చేందుకు 6 కిలోమీటర్ల రోడ్డు ఉండగా ఐదు కిలోమీటర్ల రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయటంతో ప్రజలు సుఖవంతమైన ప్రయాణం సాగిస్తున్నారు. అయితే ఇరవై రోజుల నుంచి వరినాట్లు మొదలు కావటంతో దమ్ము చక్రాల ట్రాక్టర్లు ఈ రోడ్డుపై రాకపోకలు సాగించాయి. దీంతో ఇనుప చక్రాలు తారురోడ్డుని కోసినట్టు గాళ్లుపడి తారురోడ్డు నలిగిపోయింది. నిబంధనల ప్రకారం దమ్ము చక్రాల ట్రాక్టర్లు రహదారులపై ప్రయాణించకూడదు. ఏ పొలం దమ్ము చేయాలో ఆ పొలంలోకి ట్రక్కులో తీసుకెళ్లి అక్కడ బిగించి దమ్ము చేయాలి. మళ్లీ అక్కడే వాటిని ఊడదీసి ట్రక్కులో వేసి మరోచోటికి తరలించాలి తప్పా నేరుగా రోడ్లపై ప్రయాణించకూడదని జీవో సైతం ఉంది. కాని అధికారులు ఈ జీవోని అమలు చేయలేకపోవటంతో రైతులు దమ్ము చక్రాల ట్రాక్టర్లను రోడ్లపై యథేచ్ఛగా తిప్పుతూ లక్షలవ్యయంతో నిర్మించిన రోడ్లను పాడు చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. రేపు భారీ వర్షాలు కురిస్తే ఈ తారురోడ్డు గోతులు పడిపోయే ప్రమాదం ఉందని ప్రజలు చెపుతున్నారు. ఇప్పటికైనా అధికారులు దమ్ము చక్రాల ట్రాక్టర్లను కట్టడి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



పెనమకూరు గంగానమ్మగుడి దగ్గర..



పంట పొలాల దగ్గర పాడైన తారురోడ్డు

కారు ఢీకొని ఒకరి మృతి

పమిడిముక్కల, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారిపై మంటాడ పరిధిలో కారు ఢీకొని ద్విచక్ర వాహనంపై వెళుతున్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. కారకంపాడుకు చెందిన అంగడాల ఓంకారేశ్వరరావు(45) కొంతకాలంగా కడవకొల్లులో నివసిస్తూ గండిగుంటలో ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు క్లీనర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం కారకంపాడు వెళ్లి తిరిగి వస్తుండగా మంటాడ ఫ్లైఓవర్ సమీపంలో వెనుక నుంచి వస్తున్న కారు ఢీకొని మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని ఉయ్యూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి కారు డ్రైవర్ నాగేంద్రను అదుపు లోకి తీసుకున్నారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.



ఓంకారేశ్వరరావు

ఉచిత నేత్ర వైద్య శిబిరం

గుడ్లవల్లేరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల(ఎస్ఆర్‌జీఈసి) లో ఫ్యాకల్టీకి ఉచిత నేత్రవైద్యపరీక్షల శిబిరం నిర్వహించనున్నారు. బొప్పన శరత్‌గోపాల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు కళాశాల ఫ్యాకల్టీకి నేత్రవైద్య పరీక్షలు నిర్వహించనున్నామని నిర్వాహకులు తెలిపారు.



అమ్మవారిని దర్శించేందుకు క్యూలో వేచి ఉన్న భక్తులు

కొండలమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు

గుడ్లవల్లేరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి) :వేమవరం కొండాలమ్మ అమ్మవారి ఆలయంలో ఆదివారం భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. దాదాపు 20 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారని ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు తెలిపారు. భక్తులకు దేవస్థానం వారిచే తాగునీరు, మజ్జిగ పంపిణీ చేసి ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా పర్యవేక్షించామని ఆయన తెలిపారు.



మోపిదేవిలో..

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఒకరోజు ఆదాయం రూ.10.40 లక్షలు

మోపిదేవి, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. వివిధ సేవా రుసుముల ద్వారా ఆదివారం ఒక్కరోజే రూ.10,40,787ఆదాయం లభించినట్లు ఈవో తెలిపారు. తెల్లవారుజాము నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. నాగవల్లి వృక్షం వద్ద మొక్కుబడులు చెల్లించుకుని అనంతరం నాగ పుట్టలో పాలు పోశారు. ఈవో శ్రీరామ వరప్రసాద రావు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు పర్యవేక్షించారు.



మొక్కలు పంపిణీ చేస్తున్న న్యాయాధికారి ఎం.భాస్కరరావు

డాక్టర్ అబ్దుల్ కలాం ఫౌండేషన్ సేవలు అమోఘం

బంటుమిల్లి, జూలై13 (ఆంధ్రజ్యోతి) : బంటుమిల్లి డాక్టర్ అబ్దుల్ కలాం హెల్త్ ఫౌండేషన్ సేవలు అమోఘం అని బంటుమిల్లి జూనియర్ సివిల్ జడ్జి ఎం.భాస్కరరావు అన్నారు. డాక్టర్ అబ్దుల్ కలామ్ హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పెరటిలో సేంద్రియ పద్ధతిలో సాగుచేసే కూరగాయ మొక్కలు, విత్తనాలు పంపిణీ చేశారు. సమాజ ఆరోగ్యం కోసం చేపట్టిన కార్యక్రమాన్ని ఆయన అభినందించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యాళ్ల శ్యామ్‌బాబు, ఉపాధ్యక్షుడు పళ్లెం వెంకటేశ్వరావు, కూనపరెడ్డి రాంబాబు, యిల్లూరి రాయుడు, పరసా పద్మనాభరావు, చండిక గంగాజలరావు, నాగభూషణం, శివరామప్రసాదు, గౌరిశెట్టి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అమ్మమ్మ ఇంటికొచ్చిన బాలుడి అదృశ్యం

● 24 గంటలు గడిచినా దొరకని ఆచూకీ
● ముమ్మరంగా పోలీసుల దర్యాప్తు

తోట్లవల్లూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి) : రొయ్యూరులో పదేళ్ళ బాలుడు పడమట దుర్గా నీతీష్ మిస్సింగ్ అయ్యాడు. శనివారం సాయంత్రం 4.45 గంటల నుండి కనిపించకుండా పోయిన బాలుడు ఆదివారం సాయంత్రం వరకు జాడ లేకుండా పోవటంతో కుటుంబీకులు తల్లడిల్లుతున్నారు. పడమట నీతీస్ స్వగ్రామమం పామర్రు మండలం నిమ్మకూరు. తల్లి సరోజిని పుట్టిల్లు రొయ్యూరు. ఈమెకు కుమారుడు నితీస్, కుమార్తె ఉన్నారు. నితీష్ జుజ్జువరంలో ఓ ప్రైవేటు స్కూల్లో 4వ తరగతి చదువుతున్నాడు. శని, ఆదివారాలు రెండు రోజులు సెలవులు రావటంతో మేనమామ వీరంకి బాలకృష్ణ శనివారం నిమ్మకూరు వెళ్ళి మేనల్లుడు, మేనకోడలిని మధ్యాహ్నం 1 గంటకు రొయ్యూరు తీసుకు వచ్చాడు. నితీష్ ఆడుకోవటానికి బయటకు వెళ్ళి సాయంత్రం 4.45 గంటల నుండి కనిపించలేదని చెపుతున్నారు.. దాంతో గ్రామంలో వెదికినా నితీష్ ఆచూకీ లేదు. నితీష్ మిస్సింగ్‌పై ఆదివారం ఉదయం మేనమామ వీరంకి బాలకృష్ణ తోట్లవల్లూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో సీఐ వై చిట్టిబాబు, ఎస్సై సీహెచ్ అవినాష్ రంగంలోకి దిగి దర్యాప్తు చేపట్టారు. కరకట్ట వెంట మద్దూరు వరకు, ఇటు కంకిపాడు వైపు సీసీ పుటేజీలను పరిశీలిస్తున్నారు. రాత్రి వరకు నితీష్ ఆచూకీ దొరకలేదని పోలీసులు తెలిపారు. నితీష్ గ్రామం ప్రక్కనే ఉన్న కేఈబీ కెనాల్‌లో పడి ఉండవచ్చని, లేదా కిడ్నాప్ అయి ఉండవచ్చన్న అనుమానమంతో దర్యాప్తు వేగవంతం చేశారు. తల్లి సరోజిని, కుటుంబసభ్యులు నితీష్ కోసం కన్నీరు మున్నీరవుతున్నారు.



దుర్గా నీతీష్

పేర్ని నానిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు



పామర్రు సీఐ సుభాకర్‌కు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నేతలు

పామర్రు, జూలై13(ఆంధ్రజ్యోతి):నోరు ఉందికదా అని ఇష్టమొచ్చినట్లుగా మాట్లాడితే ప్రజా ప్రభుత్వపాలనలో కుదరదని, ఇప్పటికైనా వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి పేర్నివెంకట్రామయ్య(నాని)తన మాటతీరు మార్చుకోవాలని కృష్ణాడెల్టాప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ వల్లూరిపల్లి గణేష్ అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడారు. ఈనెల 8తేదీన స్థానికంగా వైసీపీ నియోజకవర్గ సమన్వయ సమావేశంలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన పేర్ని నాని చీకట్లో మొత్తం అయిపోవాలంటూ చేసిన వాఖ్యలు సమాజంలో హింసను ప్రేరేపించే విధంగా ఉన్నాయన్నారు. వైసీపీ క్యాడర్‌ను రెచ్చకొట్టేలా విద్వేషకరమైన వ్యాఖ్యలు చేసిన నానిపై కేసునమోదు చేసి తగు చర్యలుతీసుకోవాలని పామర్రు సిఐ సుభాకర్‌ను కోరుతూ ఫిర్యాదు ఇచ్చినట్టు తెలిపారు. మాజీ ఏఎంసీ చైర్మన్ మండపాక శంకర్ బాబు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు, మాజీ అధ్యక్షుడు పరస సుబ్రమణ్యం, కోటి పాండురంగారావు, పంచాయతీ సభ్యుడు రామంజనేయులు, ప్రసాద్, రమేష్, గంటయ్య, పాల్గొన్నారు.

రాజకీయ లబ్ధి కోసమే హారిక దంపతుల డ్రామా

● యార్లగడ్డ సుధారాణి

గుడివాడ, జూలై 13(ఆంధ్రజ్యోతి) : కేవలం రాజకీయ లబ్ధి కోసమే జిల్లా పరిషత్ చైర్మన్ ఉప్పాల హారిక దంపతులు డ్రామాలు ఆడుతున్నారని, మాజీ మంత్రి పేర్ని నాని గుడివాడ వచ్చి ఉంటే రప్పా రప్పా ఏంటో చూపించేవాళ్లమని తెలుగు మహిళా విభాగం పట్టణాధ్యక్షురాలు యార్లగడ్డ సుధారాణి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ప్రజావేదికలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ మాజీ మంత్రి కొడాలి నాని గుడివాడ వదిలి పారిపోతే ఎవరిని రెచ్చగొట్టడానికి వైసీపీ నాయకులు మీటింగ్‌లను పెడుతున్నారని విమర్శించారు రాజకీయాలుంటే పెడనలో చేసుకోవాలి గానీ గుడివాడలో చేస్తానంటే కుదరదని స్పష్టం చేశారు. టీడీపీ నాయకులతో పాటు పోలీసులను హారిక దంపతులు నోటికి వచ్చినట్లు బూతులు తిట్టారని ఆరోపించారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లను సమావేశాలకు వెళ్లకుండా అడ్డుకున్న సందర్భాలను గుర్తు చేశారు. బందరులో హారిక ఫ్లేక్సీ కడతానంటే ఊరుకోనని పేర్ని నాటి రోజులను మరచిపోయి నట్టు ఉన్నారని ఎద్దేవ చేశారు. గత మూడు రోజులుగా పేర్నినాని ఎలాంటి పిచ్చి వాగుడు వాగుతున్నాడో అందరూ వింటున్నారన్నారు. ఎవరిని వేసేయమని చెప్పడానికి ఆయన గుడివాడ వచ్చేందుకు సిద్ధమయ్యాడో బహిర్గతపరచాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు టీడీపీ బీసీ నేతలు వసంతవాడ దుర్గారావు, ఈడే మోహన్, పామర్తి సత్తిబాబు, దేవరపల్లి కోటి, ఆర్నేపల్లి పండు, లోయ విజయ్, సూరగాని సూరిబాబు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న యార్లగడ్డ సుధారాణి

నేడు లక్ష్మీగణపతి హోమం

గుడివాడ, జూలై 13(ఆంధ్రజ్యోతి) : స్థానిక మెయిన్‌రోడ్డులో వేంచేసియున్న విఘ్నేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 14వ తేదీన సోమవారం ఆషాఢమాసం బహుళ సంకటహర చతుర్థి పర్వదినం సందర్భంగా లక్ష్మీగణపతి హోమం, పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి యార్లగడ్డ శ్రీనివాసరావు(వాసు) ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. హోమం పూజలో పాల్గొనే భక్తులు రూ.516లు చెల్లించి తమ గోత్రనామాలను నమోదు చేయించుకోవాలని పేర్కొన్నారు. హోమంలో పాల్గొనే వారికి పూజా సామగ్రిని దేవస్థానం వారే సమకూరుస్తారని తెలిపారు.

తులసిప్రియకు ట్రిపుల్ ఐటీ సీటు

చల్లపల్లి : పెదతుమ్మిడి హైస్కూల్ విద్యార్థిని బళ్లా తులసి ప్రియ స్కౌట్స్ అండ్ గైడ్స్ కేటగిరీలో ఒంగోలు ట్రిపుల్ ఐటీ సీటు సాధించినట్లు పురిటిగడ్డ జడ్పీహైస్కూల్ ప్లస్ తెలుగు అధ్యాపకురాలు ఓలేటి ఉమాసరస్వతి తెలిపారు.

జడ్పీ చైర్‌పర్సన్‌పై దాడి హేయమైన చర్య

● వైసీపీ పట్టణాధ్యక్షుడు గొర్ల శ్రీను

గుడివాడ, జూలై 13(ఆంధ్రజ్యోతి) : మహిళలను కన్నీరు పెట్టించిన ఏ పార్టీ మనుగడ సాగించలేదని, కూలిపోయాయని వైసీపీ పట్టణాధ్యక్షుడు గొర్ల శ్రీను పేర్కొన్నారు. ఆదివారం స్థానిక రాజేంద్రనగర్ లోని వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శనివారం గుడివాడలో జరిగిన అల్లర్లు, జడ్పీ చైర్‌పర్సన్ హారికపై జరిగిన దాడిని ఖండిస్తున్నామన్నారు. బీసీ, ఎస్సీ, మైనార్టీల ఓట్లతో అధికారంలోకి వచ్చి వారిపైనే దాడుల చేయడం హేయమైన చర్య అని అన్నారు. హారికపై జరిగింది ప్రభుత్వం చేసిన దాడి అని, వెంటనే చంద్రబాబు నాయుడు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వైసీపీకి, మాజీ మంత్రి కొడాలి నానికి ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేకే అల్లర్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రజలకు మంచి చేయడంలో పోటీపడాలని హితవు పలికారు. ఈ సమావేశంలో పార్టీ , నాయకులు మండలి హనుమంతరావు, మట్టా విక్టర్, పెయ్యల ఆదాం, షేక్ సయ్యద్, ఎం.వి నారాయణరెడ్డి, కందుల నాగరాజు, గోళ్ల రామకృష్ణ, శేఖర్, తోట నాగరాజు, మురళీ, కొంకితల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గొర్ల శ్రీను

గుడ్లవల్లేరు : గుడివాడలో కూటమికి చెందిన అల్లరిమూకలు జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక పై జరిగిన అనుచిత చర్యలను వైసీపీ బీసీ సంఘం తరపున తీవ్రంగా ఖండిస్తున్నామని కేడీసీసీ మాజీ డైరెక్టర్ పడమటి సుజాత అన్నారు. గుడ్లవల్లేరు మండలం కౌతవం గ్రామంలోని పడమటి సుజాత స్వగృహంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఒక బీసీ మహిళకు జరిగిన అవమానమేకాదు జిల్లా ప్రథమమహిళకు జరిగిన అవమానమంటే జిల్లాలోని మహిళందరికీ జరిగిన అవమానంగా తాము భావిస్తూ తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఈడే గోపాలకృష్ణ, ఆరేపల్లి శ్రీనివాసరావు,పడమట వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

రాజా మాతృమూర్తి లక్ష్మికి మంత్రి రవీంద్ర నివాళి

మచిలీపట్నం టౌన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ నాయకుడు, ఏపీ రాష్ట్ర శిష్టకర్ణ అధ్యక్షుడు అక్కుమహంతి రాజా మాతృమూర్తి అక్కుమహంతి లక్ష్మి చిత్రపటానికి మంత్రి కొల్లు రవీంద్ర ఆదివారం నివాళులర్పించారు. లక్ష్మి ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షించారు. టీడీపీ నాయకులు గొర్రెపాటి గోపీచంద్, కుంచే నాని, పి.వి. ఫణికుమార్, పల్లపాటి సుబ్రహ్మణ్యం, లంకే నారాయణ ప్రసాద్ పాల్గొన్నారు.

పెడనలో ఎమ్మెల్యే కాగిత పర్యటన

పెడన : పెడనలోని 12వ వార్డులో ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించి కరపత్రాలు అందజేశారు. కొందరు మహిళలు తమకు అమ్మకు వందనం పథకం డబ్బులు పడలేదన్న విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. టీడీపీ నాయకులు యక్కల శ్యామలయ్య, చందన నారాయణరావు, అబ్దుల్ ఖయూం, పూర్ణ, వాసా సాంబశివరావు, బొడ్డు దీక్షా, జనసేన పార్టీ నాయకులు మట్టా శివపావని, నాని, రామకృష్ణ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

● మాజీ ఎంపీపీ గుత్తా శివరామకృష్ణ



గుడివాడ రూరల్‌లో..

గుడివాడ రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): పేద, మధ్య తరగతి వర్గాల వారికి ఉచిత వైద్య శిబిరం నిర్వహించటం ద్వారా వారికి ఆర్థికంగా చేయూతనిచ్చినట్లవుతుందని మాజీ ఎంపీపీ గుత్తా శివరామకృష్ణ అన్నారు. ఆదివారం బొమ్ములూరులో ది గుడివాడ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కామినేని హాస్పటల్ విజయవాడ ప్రముఖ డాక్టర్ పి.శివ ప్రసాద్ సౌజన్యంతో లయన్స్ కంటి ఆసుపత్రి, క్యాన్సర్ హాస్పటల్ ఆధ్వర్యంలో ఉచితంగా వివిధ రకాల జబ్బులకు వైద్య శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వైద్యశిబిరం వల్ల బొమ్ములూరు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు చాలా మంది తరలివచ్చారని తెలిపారు. ప్రతి పేదవాడికీ ఉచితంగా వైద్యం అందించాలనే ఉద్దేశ్యంతో ఈ వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. వైద్యబృందం, డాక్టర్లకు, ది గుడివాడ వాకర్స్ అసోసియేషన్ సభ్యులకు ధన్యవాదాలు తెలుపుతున్నట్లు తెలిపారు. సనకా సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

కూచిపూడి : ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, కూచిపూడి రోటరీక్లబ్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో సమతా శంకరా నేత్ర చికిత్సాలయ (ఉయ్యూరు) సహకారంతో ఆదివారం కూచిపూడిలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 160 కంటి సమస్యలతో బాధపడుతున్న రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వీరిలో 48 మందికి ఆపరేషన్లుగా గుర్తించారు. డాక్టర్ ఆదిత్య తన సిబ్బందితో వైద్య సేవలు అందించారు. కూచిపూడి ఎస్సై కె.ఎస్.విశ్వనాథ్ శిబిరాన్ని ప్రారంభించగా, మొవ్వ మండల రెడ్‌క్రాస్ చైర్మన్ బెల్లంకొండ వెంకటేశ్వరరావు, కూచిపూడి రోటరీక్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు జొన్నలగడ్డ హనుమ కుమార్, బి.వి.రామశేష సాయి, సర్పంచ్ కొండవీటి విజయలక్ష్మీ, సభ్యులు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు : లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో ఆదివారం మధుమేహవ్యాధికి ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించారు.164 మంది రోగులకు రక్తపరీక్షలు, బీపీ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. గుడివాడకు చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ గవిర్నేని రజని ఉచిత వైద్యసేవలందించారు. రోగులకు ఉచితంగా 15 రోజులకు సరిపడా షుగరువ్యాధికి మందులు పంపిణీ చేశారు. శిబిరానికి డాక్టర్ నర్రా గంగాధరరావు(వెస్టిండీస్), వల్లభనేని రామకృష్ణ (యుఎస్ఏ),కొసరాజు బాపయ్య చౌదరి లు దాతలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు మేరుగు పెరుమాళ్ళు, కోశాధికారి పెంటపాటి చిట్టిబాబు,జిల్లా లయన్స్ మాజీ గవర్నర్ వైపీసీ ప్రసాద్, శిబిర కోఆర్డినేటర్ గుడ్లవల్లేరు ప్రాథమిక ఆరోగ్యకేంద్ర సిబ్బంది సింగ్, దీప్తి తదితరులు పాల్గొన్నారు.



గుడ్లవల్లేరులో..

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	103, 111, 122
చికెన్ విత్ స్కిన్	196
చికెన్ స్కిన్‌లెస్	206

నెక్ కోడిగుడ్ల ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 515

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఒక్కరోజు ఆదాయం రూ.10.40 లక్షలు

మోపిదేవి, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. వివిధ సేవా రుసుముల ద్వారా ఆదివారం ఒక్కరోజే రూ.10,40,787 ఆదాయం లభించినట్లు ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు. తెల్లవారుజాము నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. నాగవల్లి వృక్షం వద్ద మొక్కుబడులు చెల్లించుకుని అనంతరం నాగపుట్టలో పాలు పోశారు. ఈవో శ్రీరామ వరప్రసాదరావు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మాతృభాష పరిరక్షణకు కోట తోడ్పాటు

• సంస్మరణ సభలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ • పలువురు ప్రముఖుల సంతాపం

అవనిగడ్డ, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : తెలుగు భాషా పరిరక్షణకు కోట శ్రీనివాసరావు ఎంతో కృషి చేశారని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ఎమ్మెల్యే కార్యాలయంలో కోట శ్రీనివాసరావు సంస్మరణ సభ జరిగింది. కోట శ్రీనివాసరావు చిత్రపటానికి బుద్ధప్రసాద్ ఘన నివాళులర్పించారు. విజయవాడ తూర్పు ఎమ్మెల్యేగా కోట శ్రీనివాసరావు, అవనిగడ్డ ఎమ్మెల్యేగా తాను ఒకేసారి గెలిచి అసెంబ్లీకి వెళ్లినట్లు తెలిపారు. పార్టీలు వేరైనా తమ ఇద్దరి మధ్య భావ సారూప్యత ఉండేదన్నారు. రాజకీయ, సినీ రంగాలకు విస్తృత సేవ చేసిన గొప్ప వ్యక్తి కోట శ్రీనివాసరావు అన్నారు. 1 నుంచి 10వ తరగతి వరకు తెలుగు భాషను విధిగా బోధించాలని తాను అసెంబ్లీలో అనధికార తీర్మానం ప్రవేశపెట్టగా కోట శ్రీనివాసరావును మద్దతు ఇచ్చారన్నారు. జనసేన నాయకులు మండలి వెంకట్రామ్, ఏఎంసీ ఛైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షులు యాసం చిట్టిబాబు, ఏఎంసీ వైస్ ఛైర్మన్ రాజనాల వీరబాబు, డీసీ వైస్ ఛైర్మన్ బచ్చు రఘునాథ్ ప్రసాద్, కూటమి నేతలు


కోట శ్రీనివాసరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, కూటమి నేతలు

బండే కనకదుర్గ, బచ్చు కృష్ణకుమారి, కూనపరెడ్డి చంద్రశేఖర్, శోభిల ఏడుకొండలు, గుడివాక శివరావు, కమతం నరేష్, రేపల్లె విచ్చేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. మండల టీడీపీ కార్యాలయంలో కోట శ్రీనివాసరావు చిత్రపటానికి అధ్యక్షుడు యాసం చిట్టిబాబు తదితరులు నివాళులర్పించారు. మాచవరపు ఆదినారాయమణ, రఘునాథ్ ప్రసాద్, అన్నపరెడ్డి లక్ష్మీనారాయణ, లింగం బాబురావు, గుడివాక శివరావు చందన నరసింహారావు, యలవర్తి చిన్నా, బడే సుబ్బారావు, కాగిత రామారావు, తోట సురేష్, అన్నపరెడ్డి రామదాసు, సిద్దాబత్తిన హరినాథ్, పిరాటి రాంబాబు, చెన్ను బాబురావు తదితరులు పాల్గొన్నారు. కోట శ్రీనివాసరావు ప్రముఖ పారిశ్రామిక వేత్త విక్కుర్తి శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తీవ్ర సంతాపం తెలియజేశారు. **మచిలీపట్నం టౌన్ :** కోట శ్రీనివాసరావు మృతి సత్యసాయి మండలి కన్వీనర్ పోతుకూచి ఆంజనేయకుమార్ సంతాపం తెలిపారు. సరస్వతి కళా సమితి ప్రతినిధులు సి. శేషాచార్యులు (అప్పాజీ), జి. రామబ్రహ్మం, బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పి.వి. ఫణికుమార్, భారతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు కారుమూరి రాజేంద్రప్రసాద్, సాహితీమిత్రులు అధ్యక్షుడు లంకిశెట్టి బాలాజీ, భవిష్య తదితరులు కోట శ్రీనివాసరావు మృతికి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

నాగాయలంక : కోట శ్రీనివాసరావు మృతికి అభ్యుదయవేదిక అధ్యక్ష, కార్యదర్శులు తలశిల నాగేశ్వరరావు, వర్రే రాంబాబు ఒక ప్రకటనలో తమ సంతాపాన్ని తెలిపారు. కోట శ్రీనివాసరావు మృతికి రంగస్థల కళాకారులు చన్నగిరి లతా మోహన్, కన్నా రాజు, కైతేపల్లి అచ్చి య్య, పన్నాల ప్రభాకర శర్మ, మహేశ్వరపు గాంధీ, మండల బీజేపీ అధ్యక్షులు గుడివాక శివాజీ తమ సంతాపాన్ని తెలిపారు.


చిన్నాపురం డాక్టర్ లక్ష్మణస్వామి అందజేసిన 60 వేల మొక్కల పంపిణీని ప్రారంభిస్తున్న మంత్రి రవీంద్ర

మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

మచిలీపట్నం టౌన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షిద్దామని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. సహాయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హిందూ కళాశాలలో ఆదివారం జరిగిన మొక్కల పంపిణీ కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర అతిథిగా పాల్గొని మొక్కలు పంపిణీ చేశారు. చిన్నాపురం డాక్టర్ లక్ష్మణస్వామి అందజేసిన 60 వేల మొక్కల పంపిణీకి మంత్రి కొల్లు రవీంద్ర శ్రీకారం చుట్టారు. తెలుగు రైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ, రెడ్‌క్రాస్ ప్రతినిధి కొత్తగుండు రమేష్, సంస్థ అధ్యక్షుడు ఉస్మాన్‌బాషా, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సేంద్రియ కూరగాయ మొక్కలు పంపిణీ చేస్తున్న న్యాయాధికారి ఎం.భాస్కరరావు

డాక్టర్ అబ్దుల్ కలాం ఫౌండేషన్ సేవలు అమోఘం

బంటుమిల్లి, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : బంటుమిల్లి డాక్టర్ అబ్దుల్ కలాం హెల్త్ ఫౌండేషన్ సేవలు అమోఘం అని బంటుమిల్లి జూనియర్ సివిల్ జడ్జి ఎం.భాస్కరరావు అన్నారు. డాక్టర్ అబ్దుల్ కలామ్ హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పెరటిలో సేంద్రియ పద్ధతిలో సాగు చేసే కూరగాయ మొక్కలు, విత్తనాలు పంపిణీ చేశారు. సమాజ ఆరోగ్యం కోసం చేపట్టిన కార్యక్రమాన్ని ఆయన అభినందించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యాళ్ల శ్యామ్‌బాబు, ఉపాధ్యక్షుడు పళ్లెం వెంకటేశ్వరావు, కూనపరెడ్డి రాంబాబు, యిల్లూరి రాయుడు, పరసా పద్మనాభరావు, చండిక గంగాజలరావు, నాగభూషణం, శివరామప్రసాదు, గౌరిశెట్టి నాగేశ్వరరావు, సుజ్ఞానం జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

మచిలీపట్నం టౌన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : పీఏసీఎస్ అధ్యక్షులు రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని డీసీఎంఎస్ ఛైర్మన్ బండి రామకృష్ణ అన్నారు. వాడపాలెం పీఏసీఎస్ అధ్యక్షుడిగా దారపురెడ్డి వీరాంజనేయ ప్రసాద్ (చంటిబాబు), సభ్యులుగా మేడిశెట్టి రజనీకుమార్, పొన్నాల నాంచారయ్య ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. బండి రామకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. దారపురెడ్డి వీరాంజనేయ ప్రసాద్‌ను మాజీ ఎంపీపీ, టీడీపీ రూరల్ మండల అధ్యక్షుడు కాగిత వెంకటేశ్వరరావు, పెదయాదర సర్పంచ్ గల్లా తిమోతి, జనసేన నాయకులు మాదివాడ రాము, గడ్డం రాజు, న్యాయ వాది లంకిశెట్టి బాలాజీ, జనసేన కార్పొరేటర్ పినిశెట్టి ఛాయాదేవి తదితరులు అభినందించారు.


పీఏసీఎస్ అధ్యక్షుడు వీరాంజనేయ ప్రసాద్ ప్రమాణస్వీకారంలో పాల్గొన్న బండి రామకృష్ణ


12వ నెంబర్ కాలువ వద్ద మరమ్మతు పనులను పరిశీలిస్తున్న మండలి వెంకట్రామ్, నేతలు

12వ నెంబర్ కాలువకు తక్షణం మరమ్మతులు

మోపిదేవి, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : రైతుల సమస్యలకు తక్షణ పరిష్కారం చూపినట్లు జనసేన నాయకులు మండలి వెంకట్రామ్ తెలిపారు. కోసూరువారిపాలెంలో 600 ఎకరాలకు సాగునీరు అందించే 12వ నెంబర్ పంట కాలువ గండి సమస్యను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సూచనల మేరకు నీటి సంఘం అధ్యక్షుడు భోగిరెడ్డి సాంబయ్య స్పందించి కాలువకు ఏర్పడిన గండి పూడ్చి, కాంక్రీట్ చేయించారు. బలహీన పడిన గట్టు బలోపేతం చేశారు. పనులను ఆదివారం సాయంత్రం మండలి వెంకట్రామ్, భోగిరెడ్డి సాంబయ్య రైతులతో కలసి పరిశీలించారు. రైతులు గొల్లపాటిరేవు డ్రైనేజీ పూడిక తీయిస్తే కలిగే ప్రయోజనాలను వెంకట్రామ్‌కు వివరించారు. జనసేన మండల అధ్యక్షులు పూషడపు రత్నగోపాల్, బీజేపీ మండల అధ్యక్షులు సనకా ప్రశాంత్, ఎంపీటీసీ సభ్యుడు సనకా రాజేష్, నాయకులు కోసూరు శివాజీ, మెరనపల్లి నరేష్, కూరేటి రాఘవ, బాదర్ల లోలాక్ష నాయుడు, కోసూరు నాగమల్లేశ్వరరావు, యక్కటి రామాంజనేయులు, కూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు.



పాత ఎడ్లంకలో సుపరిపాలనలో తొలి అడుగు

అవనిగడ్డ రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): తుంగలవారిపాలెం, పాత ఎడ్లంక గ్రామాల్లో సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఏఎంసీ ఛైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు యాసం చిట్టిబాబు ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరించారు. పాత ఎడ్లంక సర్పంచ్ పాలేపు స్వామాజ్యం, కర్రా సుధాకర్, బండే రాఘవ, పరుచూరి దుర్గా ప్రసాద్, షఫ్రక్ బాబావలి, దాసినేని శ్రీనివాసరావు, కటికల బాలాజీ, అడపా శ్రీను, డీసీ వైస్ ఛైర్మన్ బచ్చు రఘనాథ ప్రసాద్, గుడివాక శివరావు, మాచవరపు ఆదినారాయణ, విశ్వనాథ/ని మురళీ, యలవర్తి చిన్న, గరికపాటి హరిబాబము, శ్రీనివాసరావు, భోగిరెడ్డి బుజ్జి, మాజీ సర్పంచ్ దోవారి శ్రీను, తోట శ్రీను, రెండు గ్రామాల కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.


లక్ష్మీపురంలో సీతాదేవికి, చల్లపల్లిలో వాసవీమాతకు ఆషాడ సారె సమర్పించిన ఆర్యవైశ్య మహిళలు


వేంకటేశ్వరస్వామిఆలయంలో శ్రీదేవి, భూదేవిలకు..

అమ్మవారికి భక్తిశ్రద్ధలతో ఆషాఢ సారె

చల్లపల్లి, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : చల్లపల్లి, లక్ష్మీపురం గ్రామాల్లో అమ్మవార్లకు ఆషాఢ సారె సమర్పణ ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. లక్ష్మీపురం గౌడపాలెంలోని సీతారామాలయంలో సీతమ్మవారికి భక్తులు సారె సమర్పించారు. చల్లపల్లి గౌడపాలెం వేములవారి ఆడపడుచులు అంకమ్మ తల్లికి ఆషాఢసారె సమర్పించారు. శ్రీఆర్యవైశ్య యువజనం సంఘం ఆధ్వర్యంలో శ్రీవాసవీ మహిళా మండలి సహకారంతో శ్రీకన్యకా పరమేశ్వరి అమ్మవారికి ఆదివారం ఆషాఢ సారె సమర్పించారు సంపటాలమ్మ తల్లికి, వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోదాదేవికి, శివాలయంలో అన్నపూర్ణాదేవికి పసుపు కుంకుమ సమర్పించిన అనంతరం వాసవీమాత ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి శాకాంబరీ అలంకారం చేయగా, వాసవీస్తోత్రం, లలితా సహస్రనామ పారాయణం చేశారు. యువజన సంఘం అధ్యక్షుడు తమ్మన సాంబశివరావు, కిషోర్, మారుతి, మణికంఠ, ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష కార్యదర్శులు అన్నవరపు పాండురంగారావు, వరదా హరిగోపాల్, తమ్మన సతీష్‌కుమార్, వరదా రాజశేఖర్, కొల్లిపర మధు, మహిళా మండలి అధ్యక్షురాలు కొల్లిపర నళిని, జయలక్ష్మి పాల్గొన్నారు. **అవనిగడ్డ :** లంకమ్మ అమ్మవారు శాకాంబరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు భారీగా తరలివచ్చి ఘటం బిందెలతో మొక్కు బడులు చెల్లించుకున్నారు. మూడో వార్డుకు చెందిన భక్తులు ఆషాఢ సారెను భక్తిశ్రద్ధలతో సమర్పించారు. ఆలయ ఈవో


రాజేశ్వరిదేవికి సారె.. శాకంబరిగా నాంచారమ్మ, లంకమ్మ

యార్లగడ్డ శ్రీనివాసరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. **కోడూరు :** విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ ఆదివారం శాకంబరీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. నాంచారమ్మ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసినట్లు ఈవో జయశ్రీ తెలిపారు. **అవనిగడ్డ రూరల్ :** అవనిగడ్డ నుంచి ఊరేగింపుగా తరలివచ్చి ఆర్యవైశ్య మహిళలు పులిగడ్డలో అలివేలు మంగ రాజ్యలక్ష్మీ అమ్మవారికి ఆషాఢ సారె సమర్పించారు. అర్చకులు దీవి పార్థసారథి ఆచార్యులు, విఖనసాచార్యుల ఆధ్వర్యంలో అలివేలు మంగ రాజ్యలక్ష్మీ సమేత వేంకటేశ్వరస్వామి శాంతి కల్యాణ మహోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. కల్యాణం కన్నుల పండువగా జరిగింది. ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావు, ఉత్సవ కమిటీ సభ్యులు మండలి భావన్నారాయణ పర్యవేక్షించారు. అనంతరం అన్నదానం జరిపారు. అర్చకులు దీవి నరసింహమూర్తి ఆధ్వర్యంలో వేకనూరులో సూర్యనారాయణ స్వామి శాంతి కల్యాణం ఆదివారం వైభవంగా నిర్వహించారు. తుంగల శ్రీనివాసరావు - నాగ సీత దంపతులు కల్యాణ కర్తలుగా వ్యవహరించారు. తుంగల రేణుకార్జున ప్రసాద్ - లలిత దంపతులు ఆర్థిక సహకారంతో అన్నదానం నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు తుంగల వీరవసంతరావు - ఇందిరా దేవి దంపతులు పర్యవేక్షించారు. **మచిలీపట్నం టౌన్ :** గొడుగుపేట వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీదేవి భూదేవికి ఆషాఢ సారె సమర్పించారు.. విష్ణు సహస్రనామ పారాయణ చేశారు.

రాజా మాతృమూర్తి లక్ష్మికి మంత్రి రవీంద్ర నివాళి



మచిలీపట్నం టౌన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ నాయకుడు, ఏపీ రాష్ట్ర శిష్టకర్ణ అధ్యక్షుడు అక్కుమహంతి రాజా మాతృమూర్తి అక్కుమహంతి లక్ష్మి చిత్రపటానికి మంత్రి కొల్లు రవీంద్ర ఆదివారం నివాళులర్పించారు. లక్ష్మి ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షించారు. టీడీపీ నాయకులు గొర్రెపాటి గోపీచంద్, కుంచే నాని, పి.వి. ఫణికుమార్, పల్లపాటి సుబ్రహ్మణ్యం, లంకే నారాయణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పెడనలో ఎమ్మెల్యే కాగిత పర్యటన

పెడన, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : పెడనలోని 12వ వార్డులో ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించి కరపత్రాలు అందజేశారు. కొందరు మహిళలు తమకు అమ్మకు వందనం పథకం డబ్బులు పడలేదన్న విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. టీడీపీ నాయకులు యక్కల శ్యామలయ్య, చందన నారాయణరావు, అబ్దుల్ ఖయూం (హన్ను), అనుముల పూర్ణ, వాసా సాంబశివరావు, బొడ్డు దీక్షా, జనసేన పార్టీ నాయకులు మట్టా శివపావని, నాని, వరుదు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


తల్లికి వందనం రాలేదని కాగితకు చెపుతున్న మహిళ

రోటరీ క్లబ్ కార్యవర్గం ప్రమాణ స్వీకారం



మచిలీపట్నం టౌన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : సేవా కార్యక్రమాల్లో ఎంతో ఆనందం ఉంటుందని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆశాలత అన్నారు. మచిలీపట్నం రోటరీ క్లబ్‌లో నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం జరిగింది. ప్రెసిడెంట్ ఎల్.మోజెస్, కార్యదర్శిగా ఉదయకిరణ్ ప్రమాణ స్వీకారం చేశారు. డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ట, రొటేరియన్ ఎం. రమణమూర్తి, డాక్టర్ బి. ధన్వంతరీ ఆచార్య, ఆర్. శ్రీనివాసరావు, సిహెచ్. సాయిప్రసాద్, ఏ. జ్యోతి, అచ్యుతరామయ్య, పి.వి.ఫణికుమార్, జ్యోతిర్మయి, అనుపమ ముఖర్జీ తదితరులు పాల్గొన్నారు.

కరకట్టపై రెండు కార్లు ఢీ

చల్లపల్లి, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : వెలివోలు వద్ద కరకట్టపై ఆదివారం ఉదయం స్పీడ్ బ్రేకర్ వద్ద రెండు కార్లు ఢీకొన్నాయి. ఉయ్యూరు గ్రామానికి చెందిన వి.వీరభద్రరావు భార్యతో కారులో మోపిదేవి వెళ్తుండగా, స్పీడ్ బ్రేకర్ దగ్గర ముందు వెళుతున్న కారు స్లో అవగా, వీరభద్రరావు సైతం బ్రేక్ వేశారు. ఈ సమయంలో వెనుకగా వస్తున్న కారు వేగంగా ఢీకొనటంతో వెనుకభాగం దెబ్బతింది. మరో బానెట్, హెడ్‌లైట్ దెబ్బతిన్నాయి. ఢీకొట్టిన వాహనం ఎల్ బోర్డుతో తెలంగాణ రిజిస్ట్రేషన్ కలిగి ఉం ది. బాధితుని ఫిర్యాదు మేరకు చల్లపల్లి ఏఎస్సై ఉప్పాల వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పెడన మానవత కార్యవర్గం ప్రమాణ స్వీకారం

పెడన, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : ఉత్తమ సమాజ నిర్మాణమే మానవత సంస్థ ధ్యేయమని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఉమ్మడి కృష్ణాజిల్లా శాఖ శాశ్వత సెంట్రల్ కమిటీ ఛైర్మన్ మారుబోయిన కోటేశ్వరరావు అన్నారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ పెడన శాఖ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం విశ్వభారతి హైస్కూల్‌లో ఆదివారం జరిగింది. కోటేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేయించారు. అధ్యక్షుడు గా పేరిశెట్టి నాగరవి, ప్రధాన కార్యదర్శిగా కాగిత శంకర సాంబశివరావు, కోశాధికారిగా కొట్టు కోటేశ్వరరావు, ఉపాధ్యక్షుడుగా మహమ్మద్ బాబు, కార్యదర్శిగా సిద్ధాని సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులుగా చేకూరి విజయకుమార్, ఖుర్షిద్ బేగం, యక్కల పీతాంబరరావు, పైడిరాజు ప్రమాణ స్వీకారం చేశారు. గౌరీప్రసాద్, రాధాకృష్ణమూర్తి, డాక్టర్ శ్రీహరిదాస్, సుబ్బారావు పాల్గొన్నారు.

సబ్‌జోన్ వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం కార్యవర్గం



అవనిగడ్డ, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : అవనిగడ్డ సబ్ జోన్ వ్యాయామ ఉపాధ్యాయుల నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అవనిగడ్డ సబ్ జోన్ అధ్యక్షుడిగా బి.వెంకటేశ్వరరావు (ఎదురుమొండి), కార్యదర్శిగా బిపిఎల్.ప్రసాద్ (తలగడదీవి), ట్రెజరర్‌గా టి.నవీన్ (పెదకళ్లేపల్లి)ని ఎన్నుకున్నారు.

పోటుమీద మాజీ సర్పంచ్ నాగేశ్వరరావు మృతి



కోడూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : పోటుమీద మాజీ సర్పంచ్ కడవకొల్లు నాగేశ్వరరావు ఆదివారం హైదరాబాద్‌లో మృతి చెం దారు. సర్పంచ్‌గా, పీఏసీఎస్ అధ్యక్షుడిగా గ్రామ అభివృద్ధికి, రైతాంగం అభ్యున్నతికి కృషి చేశారు. ఆయన భౌతికకాయాన్ని స్వగ్రామానికి తీసుకు వస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

స్కౌట్స్ కోటాలో తులసిప్రియకు ట్రిపుల్ ఐటీ సీటు



చల్లపల్లి, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : పెదతుమ్మిడి హైస్కూల్ విద్యార్థిని బళ్లా తులసి ప్రియ స్కౌట్స్ అండ్ గైడ్స్ కేటగిరీలో ఒంగోలు ట్రిపుల్ ఐటీ సీటు సాధించినట్లు పురిటిగడ్డ జడ్పీహైస్కూల్ ప్లస్ తెలుగు అధ్యాపకురాలు ఓలేటి ఉమాసరస్వతి తెలిపారు. పెదతుమ్మిడిలో పనిచేసిన సమయంలో స్కౌట్స్ గైడ్స్ టీచర్‌గా తాను తులసిప్రియను ప్రతిష్టాత్మక నేషనల్ జంబోరి క్యాంప్‌కి తీసుకెళ్లాన ని, ఆ తర్వాత రాజ్యపురస్కార్‌కు తీసుకెళ్లానని చెప్పారు. తులసిప్రియ ను గైడ్ టీచర్ ఉమాసరస్వతి, స్టేట్ సెక్రటరీ రజియా, స్కౌట్స్ అండ్ గైడ్స్ డిస్ట్రిక్ట్ కమిషనర్ విజయలక్ష్మి, జాయింట్ సెక్రటరీ లలిత్‌మోహన్, సుభాషిణి, ఏఎస్‌వో సి.భాస్కర్, పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించారు.

123 మందికి ఉచిత కంటి వైద్య పరీక్షలు

నాగాయలంక, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ పారిశ్రామిక వేత్త, టీడీపీ నేత బొబ్బా గోవర్ధన్ ఆర్థిక సహకారంతో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ లిల్లి జాయ్ 123 మందికి కంటి పరీక్షలు చేసి అందులో 85 మందిని ఆపరేషన్‌కి రిఫర్ చేశారు. నారాయణ, ప్రసన్న కుమార్, శివ, అజయ్ పాల్గొని పర్యవేక్షించారు.

మాజేరులో భజనలు

చల్లపల్లి, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : కొత్తమాజేరు గ్రామంలో గ్రామపెద్దలు మాజేటి సీతారామయ్య దశమ వర్ధంతి సందర్భంగా భజన కార్యక్రమాలు జరిగాయి. భజన సమాజ కళాకారులకు సీతారామయ్య కుమారులు మాజేటి హరికృష్ణ, మాజేటి భీమశంకర్‌నూతన వస్త్రాలను బహూకరించి జ్ఞాపికలు అందించి సత్కరించారు. బంధుమిత్రులు, గ్రామస్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు.